RNI No.TELTEL/2005/16755
# ప్రజాబలం
PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక
Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers



హైదరాబాద్ | 12 ఫిబ్రవరి 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:213



**కొడంగల్ ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి మునిసిపల్ ఎన్నికల్లో భాగంగా కొడంగల్ పట్టణం లో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల లో వార్డ్ నెంబర్ 6, పోలింగ్ స్టేషన్12 నందు తమ ఓటు హక్కును వియోగించుకున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా!

**90 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కాంగ్రెస్ ఖాతాలో:**
**టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్**



తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించబోతోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే సుమారు 90 శాతం స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం సాధించబోతోందని ఆయన పేర్కొన్నారు.

సీఎం ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రజా పాలన ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పట్టణ ఓటర్లు పట్టం కట్టారని ఆయన తెలిపారు.

ప్రజల అవసరాలను గుర్తించి తీసుకుంటున్న వేగవంతమైన నిర్ణయాలు, పారదర్శక పరిపాలన, సామాజిక న్యాయానికి కట్టుబడి... ఇవన్నీ కలిపి కాంగ్రెస్ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరిచాయని ఆయన అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారనే విషయాన్ని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి” అని అన్నారు.

ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల అమలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు వంటి కార్యక్రమాలు ప్రజల మనసులను గెలుచుకున్నాయని ఆయన వివరించారు.

ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య వ్యవస్థ మెరుగుదలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఓటర్లలో సానుకూల భావనను కలిగించాయని చెప్పారు.

ఈ ఎన్నికల ద్వారా కాంగ్రెస్ పార్టీపై ప్రజలు ఉంచిన విశ్వాసం భవిష్యత్‌లో మరింత బాధ్యతగా పని చేయాలని సూచిస్తోందని మహేష్ గౌడ్ పేర్కొన్నారు.

“ప్రజలు ఇచ్చిన ఈ మద్దతు మా బాధ్యతను పెంచింది. ప్రతి మున్సిపాలిటీ, ప్రతి కార్పొరేషన్‌లో పారదర్శకతతో, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తాం” అని ఆయన హామీ ఇచ్చారు.

ప్రతిపక్ష పార్టీలు ప్రచారం చేసిన అసత్యాలు, అవాస్తవాలను ప్రజలు నమ్మలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చి నిలబడే ప్రభుత్వమని, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.


మహేష్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు, అభ్యర్థులకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ, పట్టణాల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు.

మొత్తానికి తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ హవాను మరింత బలపరిచాయి. ప్రజా పాలనపై ప్రజల విశ్వాసమే ఈ విజయానికి మూలకారణమని పార్టీ నాయకత్వం అభిప్రాయపడుతోంది.

# మున్సిపల్ ఎన్నికల పోలింగ్ తీరుపై డీజీపీ బి. శివధర్ రెడ్డి సమీక్ష





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్ రాష్ట్రంలో కొనసాగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ తీరుపై కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి డీజీపీ బి. శివధర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. వివిధ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని వెబ్కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సూచనలు చేశారు.మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద జరిగే గొడవలపై అయన స్పందించారు. అధికార పార్టీకి పోలీసుల మద్దతు అనేది అవాస్తవం. నల్గొండ, కరీంనగర్లో జరిగేవి చిన్న గొడవలే. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోందని అన్నారు.

# క్యూర్ పరిధిలో నగర పాలన పునర్వ్యవస్థీకరణ

**హైదరాబాద్ ప్రాంతంలో మూడు మున్సిపల్ కార్పొరేషన్ల ఏర్పాటు**
**పాలనవ్యవస్థ మరింత బలోపేతం**
**దిశగా ప్రభుత్వం చర్యలు**






**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్, ఫిబ్రవరి 11, 2026:హైదరాబాద్ మహానగర పరిధిలో వికేంద్రీకృత నగర పాలనను బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం క్యూర్ (Core Urban Region - CURE) పరిధిలో పరిపాలనా పునర్వ్యవస్థీకరణ చేపట్టింది.

మెట్రోపాలిటన్ ఏరియా ఒ అర్బన్ డెవలప్‌మెంట్ (GHMC-1) శాఖ జారీ చేసిన జి.ఓ.ఎంఎస్. నెం.55 (తేదీ: 11.02.2026) ద్వారా ఈ మార్పులు అమల్లోకి వచ్చాయి.

ఈ పునర్వ్యవస్థీకరణలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌లను ఏర్పాటు చేశారు. వేగంగా విస్తరిస్తున్న మహానగర ప్రాంతంలో పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం, పౌర సేవలను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

తాజా నిర్మాణం ప్రకారం జీహెచ్ఎంసీ ను 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 వార్డులుగా పునర్వ్యవస్థీకరించారు.

సుమారు 689 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని




ఇది కవర్ చేస్తుంది.

క్షేత్రస్థాయిలో పరిపాలన బలోపేతం చేసి, పౌరులకు వేగవంతమైన సేవలు అందించడమే ప్రధాన ఉద్దేశంగా ఈ పునర్వ్యవస్థీకరణ ను ప్రభుత్వం చేపట్టింది.

పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను సమన్వయం చేసేందుకు మెట్రోపాలిటన్ ఏరియా & అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌కు గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్ గిరి మూడు మున్సిపల్ కార్పొరేషన్ల ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. నేడు ఆయన బాధ్యతలు చేపట్టారు.ఇదే నేపథ్యంలో ఆర్.వి. కర్ణన్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు బుధవారం స్వీకరించారు.

ప్రధాన కార్యదర్శినీ కలిసిన జిహెచ్ఎంసి కమిషనర్

పునర్వ్యవస్థీకరణ అనంతరం జిహెచ్ఎంసి కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన ఆర్ వి కర్ణన్ బుధవారం మర్యాదపూర్వకంగా ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ను సచివాలయంలో కలిశారు.

# ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

**ప్రపంచంలోనే మేటి నగరాలతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి ప్రణాళికలు**
**2047 కల్లా త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యం**
**మధిర లో ఓటు వేసిన అనంతరం మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**



మధిర రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రజాస్వామ్య పండుగ లో విజ్ఞులైన తెలంగాణ ప్రజలు ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించి కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం మధిర పట్టణంలోని తొమ్మిదవ వార్డులో తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు.

ప్రపంచీకరణ తరువాత గ్రామాలు పట్టణాలుగా రూపాంతరం చెందుతున్నాయి ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతుందని తెలిపారు. 2047 కల్లా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రాన్ని తీర్చిదిదెందుకు ఇఃబీతీవ ప్యూర్, రేర్ కోర్ అర్బన్, ఫెరి అర్బన్, రూరల్ అగ్రికల్చర్ ఎకానమీ విభాగాలుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోతున్నామని తెలిపారు.

మిశ్రమలు విద్య వైద్యం మౌలిక వసతుల మేలు కలయిక ఈ ప్రణాళికలో ఉంటుందని తెలిపారు. ఎయిర్ ఇండెక్స్ సూచిక 250 దాటుతుంది ఢిల్లీ కలకత్తా వంటి నగరాల్లో నివసించడమే కష్టం అవుతుంది ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని గాలి నాణ్యతను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్లలో ఆదాయం కోల్పోతున్నప్పటికీ బ్యాటరీ వివాహనాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పట్టణాల్లో మురుగునీటిని శుభ్రం చేసేందుకు పెద్ద సంఖ్యలో ఎస్టిపిలను నిర్మాణం చేస్తున్నామన్నారు. చెరువుల ను ఆక్రమణదారుల నుంచి విముక్తి కల్పించి పార్కులు, చెరువులను టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

ఉత్పత్తికి ప్రధానమైన విద్యుత్తు సరఫరాలో రెప్పపాటు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తున్నామని, పేద కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు ?200 యూనిట్ల వరకు విద్యుత్తు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. మా ప్రభుత్వం వచ్చాక 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, గ్రామీణ ప్రాంతాల యువత పోటీ పరీక్షల కోసం హైదరాబాద్ వెళ్లకుండా నియోజకవర్గ కేంద్రాల్లోని ఆన్లైన్లో ఉచితంగా శిక్షణ పొందేందుకు అంబేద్కర్ నాలెడ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కేంద్రాల్లో దేశంలోని ప్రముఖ లెక్చరర్ల ద్వారా శిక్షణ ఇప్పిస్తామని అన్నారు. స్కిల్స్ ఉంటేనే ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు లభిస్తాయి అందుకే నియోజకవర్గ కేంద్రాల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు నెలకొల్పామని తెలిపారు. పేద బిడ్డలకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ లో విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని ఒక్కో పాఠశాలను 25 ఎకరాల్లో 200 కోట్లతో అన్ని నియోజకవర్గాల్లో నిర్మిస్తున్నామని అన్నారు . నిన్ను లేని పేదలకు 5 లక్షల రూపాయలతో ఇంద్ర మా ఇల్లు నిర్మిస్తున్నామని తెలిపారు.

# ప్రజాబలం

12 ఫిబ్రవరి 2026 గురువారం


## పాక్ యూ టర్న్ వెనుక...

రోజుకో మలుపు తిరిగిన భారత్ – పాకిస్థాన్ టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్ ఎట్టకేలకు జరగనుంది. బంగ్లాదేశ్‌తో మొదలైన ఈ వివాదం చిలికి చిలికి ఓ పెద్ద గాలివానలా మారింది. బంగ్లాదేశ్‌ను టీ20 వరల్డ్‌కప్ నుంచి బహిష్కరించిన తర్వాత భారత్‌తో తాము మ్యాచ్ ఆడబోమంటూ పాకిస్తాన్ క్రికెట్ బోర్డు భీష్మించుకుని కూర్చుంది. పాక్ తీరు చూసి దాయాదుల పోరు జరగదేమో అని అందరూ అనుకున్నారు. కానీ ఓ అదృశ్య శక్తి ఎంట్రీతో పాక్ తోకముడవక తప్పలేదు.టీ ట్వంటీ ప్రపంచకప్‌లో భారత్‌తో ఆడకూడదన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న పాకిస్తాన్ చర్యపై ఆ దేశంలో విస్తృత చర్చ జరుగుతోంది.ఆ దేశపు క్రికెటర్లు అనేకమంది దీనిని 'పాక్ విజయం'గా చెప్పుకుంటున్నారు."ఈ నిర్ణయం తీసుకున్నందుకు శ్రీలంక అధ్యక్షుడు పాకిస్తాన్‌కు కృతజ్ఞతలు చెప్పారు. ప్రభుత్వాల జోక్యం వల్ల ఈ విషయం ఆట పరిధిని దాటి పోయింది. బంగ్లాదేశ్, ఇతర సభ్య దేశాల ప్రయోజనాల కోసం పాకిస్తాన్ ఈ నిర్ణయం తీసుకోవడం అవసరం. ఎందుకంటే భారత్–పాక్ మ్యాచ్ ద్వారా వచ్చే ఆదాయంతో వాళ్లు కూడా ప్రయోజనం పొందుతారు" అని పాకిస్తాన్ మాజీ క్రికెటర్ రషీద్ లతీఫ్ జియోన్యూస్‌తో అన్నారు"మేము పరిణతితో కూడిన నిర్ణయం తీసుకున్నాం. ఈ టోర్నీలో బంగ్లాదేశ్‌కు ఎదురైన నష్టాలకు పరిహారం దక్కాలి. మా మిత్ర దేశాల కోసం మేము భారత్‌తో మ్యాచ్ ఆడుతున్నాం. మేము కావాలనుకుంటే ఆదాయంలో మా వాటా పెంచాలని డిమాండ్ చేయవచ్చు. కానీ మేమలా చేయలేదు. హుందాగా వ్యవహరించాం" అని మరో క్రికెటర్ అహ్మద్ షాజాద్ అన్నారు.ఈ నిర్ణయంతో పాకిస్తాన్‌తోపాటు మిత్రదేశాల క్రికెట్‌కు మేలు జరుగుతుందని పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు."ఇప్పుడిక దీనిపై రాజకీయాలు అనవసరం. ఈ వ్యవహారాన్ని ఇక్కడితో ముగించాలి. మేమే గెలిచామని వాళ్లుగానీ, వీళ్లుగానీ చెప్పకూడదు" అని అహ్మద్ షాజాద్ చెప్పారు."భారత్‌కు మాతో సమస్య ఉంటే, మాతో మ్యాచ్ ఆడేందుకు నిరాకరించేది. కానీ వాళ్లలా చేయలేదు. పాకిస్తాన్ మ్యాచ్ ఆడేలా ఐసీసీ ఒప్పించింది. అంటే పాక్ లేకుండా క్రికెట్ టోర్నీ నడవదని వారికి తెలుసు. క్రికెట్‌కు మా అవసరం ఉంది. మా మిత్ర దేశాల కోసమే మేమీ నిర్ణయం తీసుకున్నాం. ఇది మంచి నిర్ణయం. ఇందులో మేం గెలిచాం" అని పాక్ మాజీ క్రికెటర్ సికిందర్ బఖ్త్ అన్నారు.దీనిపై స్పందించిన బీసీసీఐ, సమస్యను పరిష్కరించడంలో ఐసీసీ పాత్రను కొనియాడింది."ఈ చర్చల ద్వారా బంగ్లాదేశ్ సెంటిమెంట్లను కూడా గౌరవించారు. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు కొంత ఉపశమనం లభించింది. వాళ్లు కూడా సంతోషంగా ఉన్నారు. ఐసీసీ ప్రయత్నాలను వాళ్లు కూడా అభినందిచారు" అని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా అన్నారు."బీసీసీఐ శక్తివంతమైన సంస్థ. అయినప్పటికీ అది పాకిస్తాన్ క్రికెట్ బోర్డు మీద ఆధారపడుతోంది. భారత్‌తో మ్యాచ్ ఆడాలా వద్దా అనేది పాక్ క్రికెట్ బోర్డు నిర్ణయిస్తుంది. మ్యాచ్ ఆడకపోతే విధించే జరిమానా చెల్లించడానికి పాక్ క్రికెట్ బోర్డు దగ్గర డబ్బుల్లేవు. అందుకే పాక్ ఈ మ్యాచ్ ఆడేందుకు ఒప్పుకుంది. బీసీసీఐకి డబ్బులే ముఖ్యం" అని శివ సేన(యూబీటీ) రాజ్యసభ ఎంపీ ప్రియాంక చతుర్వేది విమర్శించారు."ఒక రకమైన డ్రామా నడుస్తోంది. కొన్నిసార్లు వాళ్లు భారత్‌తో మ్యాచ్ ఆడేది లేదంటారు. తర్వాత ఆడతామంటారు. అన్నీవాళ్ల సంతృప్తి కోసమే చేస్తారు. ఇప్పుడు బంగ్లాదేశ్, శ్రీలంక బతిమాలడంతో వాళ్లు ఒప్పుకున్నారు. భారత్ ఏ స్థాయిలో ఆధిపత్యం చలాయిస్తుందో ఇప్పుడు మనం ఐసీసీకి చూపించాం. అందుకే వాళ్లు ఇదంతా చేస్తున్నారు. దీనికి చికిత్స లేదు" అని భారత సీనియర్ క్రికెటర్ అతుల్ వాసన్ అన్నారు.టీ ట్వంటీ వరల్డ్ కప్‌లో భాగంగా ఫిబ్రవరి15న భారత్‌తో ఆడాల్సిన మ్యాచ్ ఆడేందుకు పాక్ జట్టుకు అనుమతి ఇస్తూ ప్రధాని షాబాజ్ షరీఫ్ నిర్ణయం తీసుకున్నారు. మిత్రదేశాల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.పాకిస్తాన్ క్రికెట్ బోర్డు, ఐసీసీ ప్రతినిధులు, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సభ్యుల మధ్య జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయం గురించి ప్రధాని షాబాజ్ షరీఫ్‌కు పాక్ క్రికెట్ బోర్డు చైర్మన్ మొహిసిన్ నఖ్వీ వివరించారు.పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అభ్యర్థనలు, శ్రీలంక క్రికెట్ బోర్డు రాసిన లేఖలు, యూఏఈ, ఇతర సభ్య దేశాల సందేశాల ఆధారంగా పాకిస్తాన్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని బీబీసీ ఉర్దూ తెలిపింది.భారత్‌తో మ్యాచ్ విషయంలో పాక్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస నాయకే కృతజ్ఞతలు తెలిపారు.మరో వైపు కిస్థాన్ రోజుల వ్యవధిలోనే తన మనసు మార్చుకొని, భారత్‌తో మ్యాచ్ ఆడాలని నిర్ణయించుకోవడానికి చాలా కారణాలే ఉన్నాయి. ఐసీసీ చీఫ్‌గా ఉన్న జై షా పాకిస్థాన్ క్రికెట్ బోర్డును అష్ట దిగ్బంధనం చేశాడని చెప్పొచ్చు. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు ఇచ్చే రెవెన్యూ వాటాను ఆపేస్తామని, దీర్ఘకాలంపాటు ఆంక్షలు విధిస్తామని ఐసీసీ హెచ్చరించింది. మరోవైపు బ్రాడ్‌కాస్టర్ సైతం రంగంలోకి దిగి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పీసీబీకి వార్నింగ్ ఇచ్చింది. అదే జరిగితే నష్ట పరిహారంగా పీసీబీ భారీ మొత్తంలో చెల్లించాల్సి వస్తుంది. ఓవైపు ఐసీసీ నుంచి వచ్చే ఆదాయం ఆగిపోయి, మరోవైపు బ్రాడ్‌కాస్టర్‌తో న్యాయపోరాటం చేయాల్సి వస్తే.. పీసీబీ ఆర్థిక కష్టాలు మామూలుగా ఉండవు.ఇక భారత్‌లో టీ20 వరల్డ్ కప్ ఆడబోమంటూ టోర్నీ నుంచి బయటకు వెళ్లిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కూడా.. భారత్‌తో మ్యాచ్ ఆడాలని పీసీబీకి రిక్వెస్ట్ చేసింది. క్రికెట్ మంచి కోసం ఆడండి అని పైకి చెప్పినప్పటికీ.. అసలు కారణాలు మాత్రం వేరే. ఇప్పుడు పాకిస్థాన్ కనుక భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే.. పాకిస్థాన్‌తోపాటు టోర్నీ నుంచి అర్ధంతరంగా వైదొలిగిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుపైనా ఐసీసీ కఠిన చర్యలు తీసుకోవడం ఖాయం. అదే జరిగితే రెండు బోర్డులూ తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటాయి. ఈ పరిస్థితి నుంచి తప్పించుకోవడానికి బీసీబీ పాక్‌ను వాడుకుంది.బీసీబీపై పెనాల్టీ విధించొద్దని, భారత్ తమ దేశంలో మ్యాచ్‌లు ఆడకపోవడం వల్ల రెవెన్యూ తగ్గుతోంది కాబట్టి.. తమ రెవెన్యూ వాటా పెంచాలని.. భవిష్యత్తులో అండర్–19 వరల్డ్ కప్ లాంటి టోర్నీలను బంగ్లాదేశ్‌లో నిర్వహించేలా చూడాలన్న పీసీబీ డిమాండ్ చేసింది. అయితే బీసీబీపై జరిమానా విధించకుండా ఉండటం, జూనియర్ ఐసీసీ ఈవెంట్లకు బంగ్లా ఆతిథ్యం ఇవ్వడం పట్ల ఐసీసీ సానుకూలంగా స్పందించింది.ఓవైపు బ్రాడ్‌కస్టర్‌తో వార్నింగ్‌లు, రెవెన్యూ వాటాను ఆపేస్తామని ఐసీసీ హెచ్చరికలు.. శ్రీలంక, యూఏఈ క్రికెట్ బోర్డులు రాసిన లేఖలు.. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సైతం ఆడమని కోరడం.. ఇవన్నీ కలిసి పాకిస్థాన్‌కు మరో దారి లేకుండా చేశాయి.

## నాలెడ్జ్ ఎకానమీకి డెస్టినేషన్ గా ఆంధ్రప్రదేశ్



విజయవాడ, ఫిబ్రవరి 11 ఏపీ ఐటీ, క్వాంటం కంప్యూటింగ్ రంగాల్లో దూసుకెళ్తుందని, పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిందని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. విభజన సమస్యలు, గత పాలకులు మిగిల్చిన ఆర్థిక కష్టనష్టాల మధ్య ప్రస్తుత ప్రభుత్వం ప్రయాణం ప్రారంభించిందని పేర్కొన్నారు. మరోవైపు ఏపీ గవర్నర్ ప్రసంగానికి వైసీపీ సభ్యులు అడ్డుతగిలారు. సభ మొదలుకాగానే నిరసనకు దిగిన వైసీపీ సభ్యులు గవర్నర్ ప్రసంగాన్ని బాయ్ కాట్ చేస్తూ అదినేత జగన్ తో కలిసి సభ నుంచి వాకౌట్ చేశారు.గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు నిర్వీర్యమై, అభివృద్ధి కుంటుపడిందన్నారు. 2024లో రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యతను ప్రజలు కూటమికి అప్పగించారని, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ఏపీ సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ నేతృత్వంలో పాలన సాగుతోందని చెప్పారు. గత 19 నెలల్లో వ్యవస్థలను గాడిలో పెట్టి, 7 శ్వేత పత్రాల ద్వారా పారదర్శకతను తీసుకువచ్చినట్లు వివరించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా 10 సూత్రాలతో సుపరిపాలన అందిస్తున్నట్లు స్పష్టం చేశారు.రాష్ట్రం ఐటీ, క్వాంటం కంప్యూటింగ్ వంటి అత్యాధునిక రంగాల్లో దూసుకుపోతోందని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ తన ప్రసంగంలో వెల్లడించారు. అంతర్జాతీయ సంస్థలు ఏపీని పెట్టుబడులకు, నాలెడ్జి ఎకానమీకి ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకుంటున్నాయని పేర్కొన్నారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటుతో నూతన అధ్యాయం మొదలైందని, ప్రపంచంలోని కొద్ది ప్రాంతాల్లోనే ఉండే ఈ సాంకేతికతను రాష్ట్రంలో స్థాపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. యువతకు భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేలా టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.పారిశ్రామిక ప్రగతి కోసం రాష్ట్రవ్యాప్తంగా 175 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. స్పేస్ సిటీ, ఏరోస్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, గ్రీన్ హైడ్రోజన్ సిటీ వంటివి రాష్ట్ర అభివృద్ధికి కీలకం కానున్నాయి. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఏటా రూ. 33 వేల కోట్లతో సూపర్ సిక్స్ సహా వివిధ డీబీటీ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఎన్టీఆర్ భరోసా ద్వారా 63.12 లక్షల మందికి పెన్షన్లు, తల్లికి వందనం కింద 66 లక్షల మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందుతోంది.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే స్త్రీశక్తి, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చే దీపం 2.0 పథకాలు విజయవంతంగా సాగుతున్నాయి. అన్నదాత సుఖీభవ ద్వారా 46.86 లక్షల మంది రైతులకు రూ. 20 వేల చొప్పున లబ్ధి చేకూరుతోంది. నిరుద్యోగ నివారణకు మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టులు, 5,757 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది.పేదరికం లేని సమాజ స్థాపనే లక్ష్యంగా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ప్రతి కుటుంబానికి ప్రయోజనాలు చేకూరుస్తున్నారు. త్వరలోనే ప్రతి కుటుంబానికి 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు' అందించేందుకు కసరత్తు జరుగుతోంది. పీ4 (ఖ4) విధానం ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆకలి లేని రాష్ట్రం కోసం 113 నియోజకవర్గాల్లో 205 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేశారు, త్వరలో గ్రామీణ ప్రాంతాలకు వీటిని విస్తరిస్తారు. అందరికీ గృహాలు, ఎస్సీ వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయం, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి సర్కార్ కట్టుబడి ఉంది. బీసీల అభ్యున్నతికి ఎంఎస్ఎంఈ (ఓఓఇ)ల ద్వారా ఉపాధి కల్పిస్తూనే, మైనారిటీల భద్రత, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు గవర్నర్ తన ప్రసంగంలో వెల్లడించారు.గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. 'ప్రజల వైద్య ఖర్చులు తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం 'సంజీవని' కార్యక్రమం ద్వారా ఆరోగ్య భద్రతను బలోపేతం చేస్తోంది. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి రూ. 2.5 లక్షల వరకు సమగ్ర ఆరోగ్య బీమా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనితో పాటు 1.43 కోట్ల పేద కుటుంబాలకు రూ. 25 లక్షల వరకు నగదు రహిత వైద్యం అందుబాటులోకి తీసుకువస్తోంది. క్యాన్సర్ వంటి ఖరీదైన చికిత్సలకు ఎలాంటి పరిమితి లేకుండా ఉచిత వైద్యం అందించడం ఈ పథకం ప్రత్యేకత. గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీలను బలోపేతం చేస్తూనే, మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి ద్వారా మహిళలకు న్యాయ సహకారం అందిస్తోంది. అక్రమ మద్యం, గంజాయి నిర్మూలనలో ప్రభుత్వం విశేష పురోగతి సాధించింది.రాష్ట్ర సాగునీటి రంగానికి వెన్నెముక వంటి పోలవరం ప్రాజెక్టును 2027 జూన్ నాటికి పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉంది. నదుల అనుసంధానం ద్వారా గోదావరి వరద జలాలను కరువు ప్రాంతాలకు తరలించేలా కార్యాచరణ చేపట్టింది. రాష్ట్రంలోని 28 జిల్లాల సమగ్ర అభివృద్ధి కోసం విశాఖ, తిరుపతి, అమరావతి కేంద్రాలుగా మూడు రీజియన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అమరావతి పునర్నిర్మాణం వేగంగా సాగుతోందని, దీనికి శాశ్వత రాజధానిగా చట్టబద్ధత కల్పించే ప్రక్రియను కేంద్రం ప్రారంభించిందని గవర్నర్ వివరించారు. విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైల్ వ్యవస్థతో పాటు, రాష్ట్రం మీదుగా వెళ్లే మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు రాష్ట్ర ప్రగతికి ఊతమిస్తాయని' తన ప్రసంగంలో పేర్కొన్నారు.అభివృద్ధి వ్యూహంలో మహిళలను ఆర్థిక భాగస్వాములుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పిస్తూ, ఏటా లక్ష మందిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతోందని గవర్నర్ పేర్కొన్నారు. 'వచ్చే ఏడాదిలో ఐదు లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చాలని లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ 'వీబీ జీ రామ్ జీ' పథకం ద్వారా ఉపాధి రోజులను 100 నుంచి 125 రోజులకు పెంచారు. పోర్టు ఆధారిత అభివృద్ధి, ఆక్వా కల్చర్, రాయలసీమలో ఉద్యాన పంటల సాగు వంటి చర్యల ద్వారా ప్రాంతీయ సమానత్వాన్ని సాధించేలా ప్రభుత్వం 25కు పైగా కొత్త పాలసీలను ప్రకటించినట్లు' గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రస్తావించారు.'గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా సహా పునరుత్పాదక ఇంధనం ద్వారా క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిపై ప్రభుత్వం ఫోకస్ చేసింది. ఏపీని క్లీన్ ఎనర్జీ ఎకనామిక్ హబ్‌గా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. విద్యుత్ వినియోగదారులపై భారం వేయకుండా రూ.4,498 కోట్ల మేర ట్రూ అప్ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. తొలిసారిగా ట్రూ డౌన్ విధానం ద్వారా ప్రజలపై యూనిట్ కు 13 పైసల చొప్పున విద్యుత్ భారాన్ని తగ్గించింది. గతంలో తప్పుడు నిర్ణయాలతో ధ్వంసమైన ఏపీ విద్యుత్ రంగం ఇప్పుడు జాతీయ స్థాయిలో మోడల్‌గా అవతరించింది. తక్కువ ధరతో డేటా సెంటర్లకు విద్యుత్ అందించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సీఐఐ సమ్మిట్ ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులకు 610 ఎంఓయూలు కుదిరాయి. 16.13 లక్షల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. × 14 ఎస్ఐపీబీ ల ద్వారా 8.74 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదాన్ని తెలిపి పరిశ్రమలు స్థాపించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందిపర్యాటక రంగానికి పరిశ్రమ హోదా ఇచ్చి ఆ రంగంలో పెట్టుబడులకు ఊతమిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర బడ్జెట్‌లో అరకు లోయ, పులికాట్ సరస్సుల వద్ద టూరిజం అభివృద్ధి చేస్తోంది. వీటిని ఉపయోగించుకుని ఈ రంగంలో పెద్దఎత్తున ప్రాజెక్టులు సాధించేందుకు కృషి చేస్తోంది. సాగునీటి రంగం అభివృద్ధిలో కీలకంగా మారింది. తక్కువ వర్షపాతం కలిగిన అనంతపురం లాంటి ప్రాంతాలు హార్టీ కల్చర్ హబ్‌గా మారుతున్నాయి. పీఎం ప్రణామ్ పథకం ద్వారా రసాయన ఎరువుల వినియోగం తగ్గించి భూసారాన్ని మెరుగుపరిచేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. పొగాకు, కోకో వంటి పంటలకు మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా రైతులను ప్రభుత్వం ఆదుకుంది. 2030 నాటికి అరకు కాఫీ, కోకో ప్రాసెసింగ్‌లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని' గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు

## గవర్నర్ ప్రసంగం మధ్యలోనే వైసీపీ సభ్యులతో కలిసి వాకౌట్

విజయవాడ, ఫిబ్రవరి 11 ఏపీ అసెంబ్లీ సమావేశాలు మొదలైన కాసేపటికే వైఎస్సార్ సీపీ సభ్యులు సభ నుంచి వెళ్లిపోయారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తుంటే అడ్డుకునేందుకు ప్రయత్నించిన వైసీపీ సభ్యులు.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. వైఎస్సార్ సీపీ చాంబర్ నుంచి సభకు వచ్చిన మాజీ సీఎం జగన్ పార్టీ సభ్యులతో కలిసి మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాలని నినాదాలు చేసుకుంటూ అసెంబ్లీలోకి వచ్చిన వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కొంత సమయానికే సభ వాకౌట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తున్నారు. రాష్ట్ర విభజన సమస్యలతో పాటు ఆర్థిక కష్టనష్టాల మధ్య ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాలన ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు నిర్వీర్యమై అభివృద్ధి ఆగిపోయిందని, ఆర్థిక ఇబ్బందులు తీవ్రమయ్యాయని ఆయన అసహనం వ్యక్తం చేశారు. గతంలో శాంతిభద్రతలకు విఘాతం కలగడమే కాకుండా, 22ఏ వంటి నిబంధనలు దుర్వినియోగం అయ్యాయని విమర్శించారు. విద్యుత్, సాగునీరు, రహదారులు వంటి కీలక మౌలిక వసతుల రంగాల్లో ప్రగతి కుంటుపడిందని వివరించారు.2024లో రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యతను ప్రజలు కూటమికి అప్పగించారని గవర్నర్ గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా సాగుతోందని చెప్పారు. గత 19 నెలల కాలంలో వ్యవస్థలను గాడిలో పెట్టి, సూపర్ సిక్స్ సహా పలు సంక్షేమ కార్యక్రమాలను పునఃప్రారంభించినట్లు తెలిపారు. పాలనలో పారదర్శకత కోసం ఏడు శ్వేత పత్రాలను విడుదల చేసి, వ్యవస్థల పునరుద్ధరణపై తొలి తొమ్మిది నెలల కాలంలోనే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ప్రశంసించారు.రాష్ట్ర భవిష్యత్తు కోసం 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రకటించారు. పది సూత్రాలను నిర్దేశించుకుని సుపరిపాలన అందించడమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని సమతూకంగా పాటిస్తూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ఈ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. వ్యవస్థల పునర్నిర్మాణం ద్వారా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం ముగిసిన వెంటనే సభ వాయిదా పడింది.

## పోలింగ్ లో ఉద్రిక్తత...

అదిలాబాద్, ఫిబ్రవరి 11 ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని 11వ వార్డు రాంనగర్ పోలింగ్ కేంద్రంలో బుధవారం ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఓటు వేసేందుకు వచ్చిన పర్వీన్ అనే మహిళను పోలీసులు తనిఖీ చేయగా, ఆమె వద్ద కత్తి లభ్యమైంది. వెంటనే స్పందించిన మహిళా పోలీసులు కత్తిని స్వాధీనం చేసుకుని, ఆమెను మావల పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఆమెతో పాటు ఆమె భర్తను సైతం అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి విచారణ చేపట్టారు. ఎన్నికల వేళ ఆయుధంతో రావడంతో తోటి ఓటర్లు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 10 మున్సిపాలిటీలు, 1 కార్పొరేషన్ కు ఉదయం 7 గంటలకు ప్రారంభమైన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ మందకొడిగా కొనసాగుతోంది. ఆదిలాబాద్ లో పలు చోట్ల ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బులు పంచుతున్నారన్న సమాచారంతో పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ డబ్బులు పంచుతున్న ఇద్దరిపై ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాటిపెల్లి రాజారెడ్డి నుంచి రూ.3,440, మేకల కృష్ణ కుమార్ నుంచి రూ.2,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించిన వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. కేసు దర్యాప్తులో ఉందని వెల్లడించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ ఓటర్లను ప్రలోభపెట్టే ఉద్దేశంతో అరటిపళ్ళు పంచుతున్న వ్యక్తిపై ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ కె. నాగరాజు తెలిపారు. ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాలక్ష్మివాడలో ఓటు వేయడానికి వెళ్తున్న ఓటర్లకు అరటిపళ్ళు పంచుతూ ప్రలోభపెడుతున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ అర్షద్‌ను పోలీసులు గుర్తించారు. ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించినందుకు అతనిపై కేసు నమోదు చేసి, ఉపయోగించిన ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు.ఎన్నికల సమయంలో ఓటర్లను నగదు, బహుమతులు లేదా ఇతర ప్రలోభాలతో ప్రభావితం చేయడం చట్టవిరుద్ధమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ప్రజలు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎక్కడైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## లేబర్ కోడ్స్ రద్దు. చేయాలని డిమాండ్

### నేడు దేశ వ్యాప్త సమ్మె కు ఆదివాసి గిరిజన సంఘం మద్దతు



చింతపల్లి/(అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. మోడీ ప్రభుత్వం వ్యవసాయ కార్మిక రైతంగ వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని విమర్శించారు. ధరలు నిరంతరం పెరుగుతుండగా వాటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలం అయిందని. మరోవైపు పేదలకు ఉన్న హక్కులను హరించేస్తోందని ఆరోపించారు . హామీ ఇచ్చిన హక్కుల చట్టాలను రద్దు చేయడం వల్ల గ్రామీణ పేదలు ఉపాధి లేక. ధరలు పెరుగుదలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించేందుకు యూపీఏ ...1 ప్రభుత్వం వామపక్షాల పార్టీల మద్దతుతో మాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని అని అన్నారు. ఈ చట్టం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పనులు లభించి పేదలు వలసలు తగ్గాయని పేర్కొన్నారు. అటువంటి ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ వీ బీ జీ రాంజీ పేరు మార్చి చట్టం చేసి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై భారం మోపుతుందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి వి బి జి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి. మరియు పీవీటిజి లకు పీఎం జన్మన్ ఇల్లులు నిర్మాణానికి 10 లక్షలకు పెంచాలి. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన లక్ష రూపాయలు లబ్ధిదారులకు చెల్లించాలి. కాపీ రైతుల రూ.60 కోట్ల బకాయి ప్రోత్సహక నిధులు ఇవ్వాలి. కాపీ రైతులకు కాఫీ పిక్కలు గిట్టుబాటు ధర కల్పించాలి. ఆదివాసి మాతృభాష ఉపాధ్యాయులను కనీసవేతనం 26,000 ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. హైడ్రోపోవర్ ప్రాజెక్టు ఒప్పంద అనుమతులు జారీ చేసిన జీ.ఓ నెం.2..13.51 లను రద్దు చేయాలి. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశంలోనే జీ.ఓ నెం.3 స్థానంలోనే నూరు శాతం రిజర్వేషన్ ఉద్యోగ. ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలి. ఆదివాసి ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి. గురుకులం. ఏకలవ్య పాఠశాల. కళాశాల లలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులను కనీస వేతనం 26000 ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. అంగన్ న్వాడి .ఆశా వర్కర్లకు. స్కూల్ మిడ్ డే మీల్స్. హెచ్ఎంటిసి ఆర్టికల్చర్ మున్సిపాలిటీ కార్మికులు సాన్ టేషన్ వర్కర్లకు. పెట్రోల్ బంక్ కార్మికులు హాస్టల్ వర్కర్స్ అలాగే వివిధ శాఖల్లో పని చేస్తున్న కార్మికులకు అందరికీ కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయటానికి అన్ని శాఖల్లో పని చేస్తున్న కార్మికులు. ఉపాధి కార్మికులు ఆటో కార్మికులు కాఫీ కార్మికులు. వెలుగు వివో ఎల్ అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తారు. కార్యక్రమానికి ఆదివాసి గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు మజ్జి రాంబాబు.తంగుల ఆనంద్. కొర్ర శంకర్రావు.బి.రవుతన్న కిలో దందార్. తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఫైర్



మెదక్ ఫిబ్రవరి 11 మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సంగారెడ్డిలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. విధుల్లో ఉన్న ఓ సీఐ.. కాంగ్రెస్ అభ్యర్థి కాలర్ పట్టుకున్నట్లు ఆరోపణలు రావడం పెను దుమారానికి కారణం అయింది. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి.. పోలీసులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. బీఆర్ఎస్ రిగ్గింగ్‌కు సీఐ సహకరిస్తున్నారని సంచలన ఆరోపణలు చేసిన జగ్గారెడ్డి.. సీఐని సస్పెండ్ చేయకపోతే.. ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరికలు చేశారు.రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోంది. అక్కడక్కడా చెదురుముదురు ఘటనలు మినహా పోలింగ్ సాధారణంగానే సాగుతోంది. అయితే సంగారెడ్డిలో మాత్రం తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ స్టేషన్ వద్ద ఉన్న ఓ పోలీస్.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్ల దురుసుగా ప్రవర్తించారని.. పైగా అతని కాలర్ పట్టుకున్నారని స్వయంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి .. ఆందోళనకు దిగడం పెను దుమారం రేపింది. పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన జగ్గారెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ పరిస్థితి ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తంగా మారిందిసంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 34వ వార్డు పోలింగ్ స్టేషన్ వద్ద ఈ సంఘటన చోటు చేసుకుంది. 34 వార్డులో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి పట్ల.. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ (సీఐ) కాలర్ పట్టుకున్నారని ఆరోపించిన.. జగ్గారెడ్డి పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకుని తీవ్రంగా మండిపడ్డారు. పోలింగ్ జరగకుండా ఆపేస్తామని పేర్కొంటూ బలవంతంగా బూత్‌లోకి వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే ఆయనను పోలీసులు అడ్డుకోవడంతో.. అక్కడ తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకున్నాయి.

దీంతో ఆ పోలింగ్ స్టేషన్ వద్దకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలి రావడంతో అక్కడ పరిస్థితులు హీటెక్కాయి. 34వ వార్డులో పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి రిగ్గింగ్ చేసేందుకు ప్రయత్నించగా.. దానికి సీఐ శివకుమార్ సపోర్ట్ చేస్తున్నారని.. జగ్గారెడ్డి పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రిగ్గింగ్‌కు సహకరిస్తున్న సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయనను సస్పెండ్ చేయకపోతే మున్సిపల్ ఎన్నికలను బహిష్కరిస్తామని వార్నింగ్ ఇచ్చారుదీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే జగ్గారెడ్డికి నచ్చజెప్పేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఘటనతో సంగారెడ్డిలో శాంతి భద్రతల సమస్య ఎదురైతే దానికి సీఐ శివకుమార్, హోంగార్డ్‌లే కారణం అని మండిపడ్డారు. పోలీసులపై జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం చేస్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

## మార్చి 7 వరకు అసెంబ్లీ సమావేశాలు

## ఫిబ్రవరి 14న బడ్జెట్

## 6 బిల్లులు ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం బీఏసీ కీలక నిర్ణయాలు ఇవే

విజయవాడ, ఫిబ్రవరి 11 ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మార్చి 7 వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించింది. ఈనెల 14న బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. మహా శివరాత్రి సందర్భంగా 15,16 తేదీలో సెలవు ప్రకటించారు.ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను 17 రోజులపాటు నిర్వహించాలని బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగింది. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మార్చి 7 వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని అవసరమైతే పొడిగించాలని కూడా నిర్ణయించారు. ఇకపోతే ఈనెల 14న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు.ఫిబ్రవరి 17,18 తేదీలలో బడ్జెట్‌పై చర్చ జరగనుంది. 18న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్‌పై సమాధానం ఇవ్వనున్నారు. ఈ మేరకు బీఏసీలో నిర్ణయాలు తీసుకోవడం జరిగింది.

ఏపీలో ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. 16వ శాసనసభ ఐదో సమావేశాలను ఫిబ్రవరి 10న ప్రారంభం అయ్యాయి. ఈ మేరకు ఫిబ్రవరి 11న ఉదయం 10 గంటలకు అమరావతిలోని వెలగపూడిలో ఉన్న అసెంబ్లీ హాలులో ఉభయ సభలను (శాసనసభ, శాసనమండలి) ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగానికి వైసీపీ సభ్యులు అడగడుగునా అడ్డుపడ్డారు. నిరసనలు, నినాదాల నడుమ గవర్నర్ ప్రసంగం జరిగింది.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలిరోజే వైసీపీ సభ్యులు వాకౌట్ అయ్యారు. మరోవైపు కూటమి సభ్యులు అసెంబ్లీకి హాజరయ్యారు.ఉదయం 9.30 గంటలకు వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 9.45 గంటలకు అసెంబ్లీకి హాజరయ్యారు. 9.57 గంటలకు అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు.

ఈనెల 14న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

గవర్నర్ ప్రసంగం అనంతరం సభలో ఆయనకు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఫిబ్రవరి 12న ఈ తీర్మానంపై చర్చ ప్రారంభం కానుండగా, ఫిబ్రవరి 13న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ చర్చకు సమాధానం ఇస్తారు. ఈ సమావేశాల్లో అత్యంత కీలకమైన 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 14న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజున వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పిస్తారు. దాదాపు నాలుగు వారాల పాటు ఈ సమావేశాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌కు శాసనసభ ఆమోదం పొందడం ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశం.

ముగిసిన బీఏసీ సమావేశం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగం అనంతరం శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలోనే సభ ఎన్ని రోజులు నిర్వహించాలి....బడ్జెట్ ఎప్పుడు ప్రవేశపెట్టాలి...ప్రభుత్వ వ్యవహారాలు అనే అంశాలపై తుది నిర్ణయం తీసుకున్నారు.

బీఏసీ సమావేశంలో నిర్ణయాలు

మార్చి 7 వరకు అసెంబ్లీ సమావేశాలు

ఫిబ్రవరి 12న అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపనున్న సభ్యులు

14న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనన్న ప్రభుత్వం

ఈనెల 15 ఆదివారం, 16 శివరాత్రి సందర్భంగా సెలవులు

మొత్తం అసెంబ్లీ పని దినాలు

11, 12, 13 ,14,

17, 18 ,19 ,20

21, 22 అసెంబ్లీకి సెలవు

23, 24 ,25 ,26 అసెంబ్లీ పని దినాలు

ఫిబ్రవి 28 మార్చి 1 అసెంబ్లీకి సెలవు

మార్చి 2,3,4,5,6,7 తేదీల్లో కొనసాగనున్న అసెంబ్లీ

మార్చి 5 ,6, 7 తేదీల్లో ఎమ్మెల్యేలకు క్రీడా పోటీలు

అసెంబ్లీలో మొత్తం 6 బిల్లులు ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

ఉదయం 9 నుండి 11 గంటల వరకు ప్రశ్నోత్తరాలు.

17, 18 తేదీల్లో బడ్జెట్‌పై చర్చ జరగనుంది

18న ఆర్థికశాఖ మంత్రిపయ్యావుల కేశవ్ సమాధానం ఇవ్వనున్నారు.

# పోలింగ్ ఓటు వేసిన ప్రముఖులు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 తెలంగాణలోని 116 మున్సిపాలిటీలలో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ కొనసాగుతోంది. పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ లో ఓటు వేశారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు. కాసేపట్లో ఆయన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకుని ఢిల్లీకి వెళ్లనున్నారు..ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధిర మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. కరీంనగర్ జ్యోతి నగర్?లోని ఎస్సార్ హై స్కూల్ కేంద్రంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటు వేశారు. కామారెడ్డి పట్టణంలోని 151 పోలింగ్ బూత్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు జరుగుతున్న ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగియనుంది.

# టెట్ లో 51 శాతం ఉత్తీర్ణత

హైదరాబాద్, ఫిబ్రవరి 11 తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష జనవరి 2026 ఫలితాలు విడుదలయ్యాయి. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ మంగళవారం ఈ ఫలితాలను ప్రకటించారు. మొత్తం మీద 51.37 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించగా, ఈసారి ప్రభుత్వ ఉపాధ్యాయుల ఫలితాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్ తప్పనిసరిగా పాస్ కావాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో వేలమంది ప్రభుత్వ టీచర్లు అర్హత సాధించలేకపోవడం చర్చనీయాంశంగా మారింది.తాజా ఫలితాల ప్రకారం పరీక్షకు హాజరైన ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో 57.76 శాతం మంది (37,893 మంది) అర్హత సాధించారు. ఇతర అభ్యర్థుల ఉత్తీర్ణత శాతం (48.14 శాతం)తో పోలిస్తే ప్రభుత్వ టీచర్ల పనితీరు మెరుగ్గా ఉన్నప్పటికీ, గణనీయ సంఖ్యలో టీచర్లు విఫలమయ్యారు. మొత్తం మీద పరీక్ష రాసిన 1,95,181 మందిలో 1,00,270 మంది ఉత్తీర్ణులయ్యారు.టెట్ ప్రవేశపెట్టక ముందు నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులు రెండేళ్లలోపు టెట్‌లో అర్హత సాధించాలని గత ఏడాది సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ గడువులోగా ఉత్తీర్ణత సాధించలేకపోతే ఉద్యోగం కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో తాజా ఫలితాలు సర్వీసులో ఉన్న టీచర్లకు కీలకంగా మారాయి.టెట్‌లో అర్హత సాధించలేకపోయిన ఉపాధ్యాయులు తమ ఉద్యోగాలను నిలుపుకోవడానికి ఇంకా అవకాశం ఉంది. సుప్రీంకోర్టు నిర్దేశించిన రెండేళ్ల గడువులోపు జరిగే తదుపరి టెట్ పరీక్షల్లో వారు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. టెట్ క్వాలిఫైయింగ్ సర్టిఫికెట్‌కు జీవితకాల వ్యాలిడిటీ ఉండటంతో పాటు, ఉపాధ్యాయ నియామక పరీక్ష లో 20 శాతం వెయిటేజీ లభిస్తుంది.

## శ్రీశైలంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను తనిఖీ చేసిన

## జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైలానికి భారీగా తరలివస్తున్న భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం శ్రీశైలంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.×ఈ సందర్భంగా బస్సుల ఫ్రీక్వెన్సీ, రాకపోకల సమయాలు, వివిధ ప్రాంతాలకు బయలుదేరే బస్సుల షెడ్యూల్ తదితర అంశాలపై ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌లో బస్సులు సమయపాలన పాటిస్తున్నాయా లేదా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగుతున్నాయా అన్న విషయాలను ప్రయాణికులతో నేరుగా ముఖాముఖి మాట్లాడి తెలుసుకున్నారు. భక్తులకు స్పష్టమైన సమాచారం అందించేందుకు బస్టాండ్‌లో సమర్థవంతమైన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి, ఏ బస్సు ఏ ప్లాట్‌ఫారమ్ వద్దకు వస్తుందో, ఏ సమయానికి బయలుదేరుతుందో నిరంతరం ప్రకటించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రద్దీ సమయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, భక్తులు ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు.×అలాగే ప్రయాణికులకు కూర్చునే సదుపాయాలు తగినంతగా ఉన్నాయా లేదా, పారిశుధ్య పరిస్థితి ఎలా ఉందో, టాయిలెట్ల నిర్వహణ సక్రమంగా జరుగుతోందా లేదా అన్న విషయాలను పరిశీలించారు. బస్టాండ్‌లో ఫ్యాన్లు సక్రమంగా పనిచేయాలనీ, త్రాగునీటి సదుపాయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. భక్తుల సౌకర్యాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా, అవసరమైతే అదనపు బస్సులు నడపాలని, రాత్రి వేళల్లో కూడా సేవలను బలోపేతం చేయాలని ఆర్టీసీ అధికారులకు కలెక్టర్ సూచించారు.

## రైల్వేల్లో పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న

## చర్యల వివరాలు తెలుపండి

### రైల్వే ట్రాక్‌ల వెంట, స్టేషన్ల పరిసరాలలో పేరుకుపోతున్న చెత్త గురించి

### పార్లమెంటులో ప్రశ్నించిన తిరుపతి ఎంపీ గురుమూర్తి

రైల్వేల్లో పెరుగుతున్న ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యపై తిరుపతి లోక్‌సభ సభ్యులు మద్దిల గురుమూర్తి బుధవారం పార్లమెంటులో ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉన్నప్పటికీ రైల్వే ట్రాక్‌ల వెంట, స్టేషన్ల పరిసరాల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, ఆహార ప్యాకెట్లు తదితర వ్యర్థాలు వేస్తున్న పరిస్థితిని ఆయన ప్రస్తావించారు. రైళ్లలో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసినప్పటికీ ఈ సమస్య ఎందుకు కొనసాగుతోందని, వ్యర్థాల సేకరణ, వర్గీకరణ, రీసైక్లింగ్ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, ప్లాస్టిక్ చెత్తను ట్రాక్‌లపై వేయకుండా పర్యవేక్షణ వ్యవస్థ, జరిమానా విధానం ఉందా అనే అంశాలపై వివరాలు కోరారు.

ఈ ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానమిస్తూ రైల్వేల్లో వ్యర్థాల నిర్వహణకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రైళ్లలో సేకరించిన చెత్తను మార్గమధ్యంలో గుర్తించిన స్టేషన్లలో శాస్త్రీయ పద్ధతిలో నిర్వహిస్తున్నామని చెప్పారు. రైళ్లలో పనిచేసే హౌస్‌కీపింగ్ సిబ్బందికి ట్రాక్‌లపై చెత్త వేయరాదని కఠిన ఆదేశాలు జారీ చేశామని, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ట్రాక్‌ల వెంట రాగ్ పికింగ్ ద్వారా నిరంతర శుభ్రత నిర్వహిస్తున్నామని తెలిపారు.స్టేషన్లలో బయోడిగ్రేడబుల్, నాన్-బయోడిగ్రేడబుల్ వ్యర్థాల వర్గీకరణ కోసం రెండు బిన్‌ల విధానం అమలు చేస్తున్నామని అన్నారు. అవసరాన్ని బట్టి ప్లాస్టిక్ బాటిల్ క్రషింగ్ యంత్రాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి చెప్పారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మున్సిపల్ సంస్థలతో కలిసి వ్యర్థాల నిర్వహణకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. అవసరమైన చోట్ల మురుగునీటి శుద్ధి కేంద్రాలు, వర్క్‌షాపులు, లోకో షెడ్లలో నుంచి వచ్చే రసాయన మలిన జలాల శుద్ధి కోసం ఎఫ్లువెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, అలాగే మెటీరియల్ రికవరీ ఫెసిలిటీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.ప్రయాణికుల్లో అవగాహన పెంచేందుకు నిరంతరం ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, డివిజనల్, జోనల్, హెడ్‌క్వార్టర్ స్థాయిలో రెగ్యులర్, ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. స్వచ్ఛ భారత్ అభియాన్ కింద ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా ప్రయాణికుల కోచ్‌లలో బయో టాయిలెట్ల ఏర్పాటు ద్వారా ట్రాక్‌లపై మానవ వ్యర్థాల ప్రత్యక్ష విడుదలను పూర్తిగా నిలిపివేశామని వెల్లడించారు. 2004 నుండి 2014 వరకు 9,587 బయో టాయిలెట్లు ఏర్పాటు చేయగా, 2014 నుండి ఇప్పటివరకు 3,61,572 బయో టాయిలెట్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.

# పోర్టు రాకతో మచిలీపట్టణానికి మహర్ధశ

విజయవాడ, ఫిబ్రవరి 11, మచిలీపట్నం రూపురేఖలు మారబోతున్నాయి. అక్కడ కొత్తగా షిప్ బిల్డింగ్, రిపేర్ల కోసం సెంటర్ ఏర్పాటు చేయడానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఏపీ ప్రభుత్వం మారిటైమ్ బోర్డుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు మచిలీపట్నంలో షిప్‌బిల్డింగ్, రిపేర్ సౌకర్యాల ఏర్పాటు కోసం పలు సంస్థలతో సంప్రదింపులు జరుగుతున్నాయి. అనుకున్నట్లుగానే మచిలీపట్నం వాసుల కల నెరవేరనుందని జనసేన పార్టీ ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు.. ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయంటున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధిపై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉన్న మచిలీపట్నం పోర్టు పనుల్ని కేంద్రం సహకారంతో మరింత వేగవంతం చేసింది. తాజాగా మచిలీపట్నంలో నౌకా నిర్మాణం (షిప్ బిల్డింగ్), మరమ్మతుల కోసం కేంద్రం ఏర్పాటు దిశగా అడుగులు పడ్డాయి. మారిటైం బోర్డు సీఈవో ఆర్ఎఫ్‌పీ జారీ చేసేందుకు ప్రభుత్వాన్ని అనుమతి కోరగా.. గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఏపీ మారిటైం బోర్డు రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) జారీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. మచిలీపట్నంలో ప్లాన్ చేస్తున్న నౌకా నిర్మాణం, మరమ్మతుల కేంద్రాన్ని డీబీఎఫ్‌వోటీ (డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేటింగ్ అండ్ ట్రాన్స్‌ఫర్) విధానంలో ఏర్పాటు చేయనున్నారు.మచిలీపట్నంలో ప్లాన్ చేస్తున్న నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఓ సంస్థ ప్రతిపాదించిందట. 200 ఎకరాలలో, సుమారు రూ.1,500 కోట్లతో గోవా షిప్‌యార్డు లిమిటెడ్ మచిలీపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెబుతోందట. ఈ మేరకు భూమిని కేటాయించాలని కూడా కోరింది. అయితే రూ.7,600 కోట్లతో ప్రాజెక్టు చేపట్టేందుకు యునైటెడ్ పెట్రో గ్రూప్ కూడా అధికారులతో సంప్రదింపులు జరుపుతోందట. త్వరలోనే దీనిపై కూడా క్లారిటీ వస్తుందని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే.. మచిలీపట్నంలో పోర్టు నిర్మాణ పనులు రూ.4,735.18 కోట్ల వ్యయంతో జరుగుతున్నాయి. మచిలీపట్నం పోర్టులో 2026 డిసెంబరు నాటికి కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తున్నారు.ఏపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి స్పందించారు. 'మచిలీపట్నంలో నౌకా నిర్మాణం, మరమ్మత్తుల సదుపాయాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడం బందరు అభివృద్ధికి కొత్త అధ్యాయం. పోర్ట్ రూపురేఖలు మారి, ఉపాధి అవకాశాలు విస్తరించే చారిత్రాత్మక నిర్ణయం. ఈ అంశానికి సంబంధించిన జివోను జారీ చేసి అనుమతులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారికి నా కృతజ్ఞతలు' అంటూ మచిలీపట్నం ఎంపీ బాలశౌరి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# ఆ ప్రాంతాలు.. ఇక సూపర్

నెల్లూరు, ఫిబ్రవరి 11, రాష్ట్రంలో రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి నెల్లూరు వరకు రైల్వే లైన్లను 4 వరుసలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మార్గంలో రైల్వే లైన్లు పెరగడం ద్వారా సరకు రవాణా వేగవంతంగా చేయవచ్చు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 774 రైల్వే లెవల్ క్రాసింగ్ల వద్ద ఆర్వోబీ, ఆర్‌యూబీలను నిర్మించి, రైల్వే గేట్లు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. హైదరాబాద్- అమరావతి- చెన్నై, హైదరాబాద్-బెంగళూరు వంటి బుల్లెట్ రైలు కారిడార్లు ఏపీ మీదుగా వెళ్లడం వల్ల ఏపీకి భారీ ప్రయోజనం చేకూరుతుందని సీఎం చంద్రబాబు దీమా వ్యక్తం చేశారు. రైల్వేతో పాటు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు సైతం నిధుల కొరత ఉన్న కారణంగా, అందుకు అవసరమైన భూసేకరణపై కలెక్టర్లు ఫోకస్ చేయాలని సూచించారు. గడువులోగా భూములు సేకరించేందుకు ప్రయత్నించాలని, తమకు సంబంధం లేదు అనేలా కలెక్టర్లు వ్యవహరించకూడదని మంత్రులు, కార్యదర్శుల సదస్సులో సీఎం చంద్రబాబు సూచించారుప్రస్తుతం ఉత్పత్తుల రవాణా ఖర్చు సగటున 14 శాతంగా ఉందని, దీనిని 7 నుంచి 8 శాతానికి తగ్గించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీలో ప్రస్తుతం 400 లక్షల టన్నుల ఉద్యాన పంటలు ఉత్పత్తి అవుతుండగా, రాబోయే ఐదేళ్లలో దీనిని 1,000 లక్షల టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అనంతపురం నుంచి అరటిపండ్ల రవాణా తరహాలోనే అన్ని రకాల పంటల ఎగుమతుల కోసం మెరుగైన లాజిస్టిక్స్ సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. అలాగే సీ ప్లేన్ల నిర్వహణలో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలవబోతోందని చంద్రబాబు పేర్కొన్నారు.రాష్ట్రంలో విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని భారీగా తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం యూనిట్‌కు రూ. 5.18 ఉన్న వ్యయాన్ని ఎలాగైనా సరే రూ. 4 లోపు (రూ. 3.90) తీసుకురావడమే లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి, స్టోరేజీ, డిస్ట్రిబ్యూషన్ అన్నీ ఒకే దగ్గర ఉండేలా నూతన విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ట్రూడౌన్ ద్వారా వినియోగదారుడికి ప్రయోజనం దక్కేలా చూస్తామన్నారు. గతంలో నీటి కొరత, విద్యుత్ కొరత అధికంగా ఉండేది. ఇప్పుడు వాటిని అధిగమించామన్నారు.పర్యావరణ హితం కోసం ఆర్టీసీలో 1,000 విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నామని, పీఎం కుసుమ్, సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని కలెక్టర్లను సీఎం చంద్రబాబు ఆదేశించారు. భూగర్భ జలాలు ఒక్క మీటరు పెరగడం ద్వారా మనకు రూ.4 వేల కోట్ల వరకు ఆదా అవుతుందని తెలిపారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా, నిర్లక్ష్యం లేకుండా కలెక్టర్లు, అధికారులు పనిచేసి రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలన్నారు.

# వేటు కోసం కొలికపూడినిరీక్షణ

విజయవాడ, ఫిబ్రవరి 11, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహారం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. అమరావతి ఉద్యమ నేతగా గుర్తింపు పొంది, చంద్రబాబు నాయుడు నమ్మకంతో టికెట్ ఇచ్చి గెలిపించిన కొలికపూడి.. ప్రస్తుతం అదే పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటిస్తున్నారా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. కొలికపూడి శ్రీనివాసరావు గత కొంతకాలంగా తన అసంతృప్తిని నేరుగా కాకుండా వాట్సాప్ స్టేటస్‌ల ద్వారా వ్యక్తం చేస్తున్నారు. ఆయన పెట్టిన ఓ స్టేటస్ కూటమి ప్రభుత్వంలో కలకలం రేపింది. 3 వారాల పాటు 35 గ్రామాల్లో 480 కుటుంబాలతో ఆత్మీయ సంభాషణ జరిపాను.. రోడ్లు లేని పల్లెలు, ఉద్యోగాలు రాని పిల్లలు.. పల్లె కన్నీరు పెడుతోంది అనే అర్థం వచ్చేలా ఆయన పోస్ట్ చేయడం, పరోక్షంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సొంత పార్టీ ఎమ్మెల్యే అయి ఉండి, విపక్ష వైసీపీ విమర్శించే తీరులోనే ఆయన పోస్ట్‌లు ఉండటం పార్టీ శ్రేణులను విస్మయానికి గురిచేస్తోంది.కేవలం ప్రభుత్వంపైనే కాకుండా, పార్టీలోని కీలక నేతలను కూడా ఆయన టార్గెట్ చేస్తున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తన వద్ద టికెట్ కోసం రూ. 5 కోట్లు డిమాండ్ చేశారని, ఇప్పటికే కొంత మొత్తం చెల్లించానని సంచలన ఆరోపణలు చేశారు. అంతేకాకుండా, నియోజకవర్గంలో మండల అధ్యక్షుల ఎంపికలో తన ప్రమేయం లేదని, పేకాట క్లబ్‌లు నడిపేవారికి పదవులు ఇస్తున్నారంటూ బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. ఈ పరిణామాలు టీడీపీ హైకమాండ్‌కు పెద్ద తలనొప్పిగా మారాయి.కొలికపూడి వైఖరి చూస్తుంటే ఆయన వైసీపీ వైపు అడుగులు వేస్తున్నారా అనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఎంపీ కేశినేని చిన్ని కూడా కొలికపూడిని వైసీపీ కోవర్టు గా అభివర్ణించడం ఈ అనుమానాలకు బలం చేకూర్చింది. గతంలో వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో ఆయన భేటీ అవ్వడం, వైసీపీ సర్పంచ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు రావడంతో.. ఆయన త్వరలోనే కండువా మార్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.ఇప్పటికే టీడీపీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు నోటీసులు ఇచ్చి వివరణ కోరింది. చంద్రబాబు నాయుడు కూడా గతంలో ఆయనను హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి. అయితే, కొలికపూడి మాత్రం తన తీరు మార్చుకోకపోగా, మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఒకవేళ పార్టీ తనపై చర్యలు తీసుకుంటే, అది తనకు రాజకీయంగా మైలేజ్ ఇస్తుందని, సానుభూతి పొందే అవకాశం ఉంటుందని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన తన నియోజకవర్గంలో సొంతంగా కార్యక్రమాలు చేసుకుంటూ, పార్టీ యంత్రాంగాన్ని పక్కన పెట్టేశారు. అలాగే టీడీపీ నుంచి కూడా ఆయనకు పిలుపులు రావడం లేదు. వేటు కోసం కొలికపూడి వ్యవహారం కేవలం ప్రజా సమస్యలకే పరిమితం కాలేదు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)పై ఆయన చేసిన ఆరోపణలు పార్టీలో భూకంపం సృష్టించాయి. టికెట్ కోసం రూ. 5 కోట్లు డిమాండ్ చేశారని, ఇప్పటికే కొంత ఇచ్చానని ఆయన అనడం టీడీపీ క్రమశిక్షణను ప్రశ్నించేలా ఉంది. దీనికి ప్రతిగా ఎంపీ చిన్ని, కొలికపూడిని "వైసీపీ కోవర్టు"గా అభివర్ణించడంతో ఈ వివాదం వ్యక్తిగత దూషణల స్థాయికి చేరుకుంది. నియోజకవర్గంలో మండల అధ్యక్షుల ఎంపికలో తనకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, పేకాట క్లబ్ నిర్వాహకులకు పదవులు ఇస్తున్నారన్నది కొలికపూడి ప్రధాన ఆరోపణకొలికపూడి వైఖరిని గమనిస్తున్న విశ్లేషకులు దీని వెనుక బలమైన రాజకీయ వ్యూహం ఉందని భావిస్తున్నారు. పార్టీ తనపై చర్యలు తీసుకుంటే, దానిని 'దళిత నేతపై అణచివేత'గా చిత్రీకరించి సానుభూతి పొందాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో భేటీ కావడం, స్థానిక వైసీపీ నేతలతో సత్సంబంధాలు కలిగి ఉండటం ఆయన త్వరలోనే పార్టీ మారతారనే ఊహాగానాలకు బలం చేకూరుస్తున్నాయి. పార్టీ యంత్రాంగాన్ని పక్కన పెట్టి సొంతంగా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నియోజకవర్గంలో తనకంటూ ఒక ప్రత్యేక కేడర్‌ను నిర్మించుకోవాలని ఆయన చూస్తున్నారు. ఇప్పటికే టీడీపీ క్రమశిక్షణ కమిటీ కొలికపూడికి నోటీసులు జారీ చేసింది. సాధారణంగా క్రమశిక్షణ విషయంలో కఠినంగా ఉండే చంద్రబాబు, కొలికపూడి విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఒకవేళ ఆయనను సస్పెండ్ చేస్తే అమరావతి ఉద్యమ నేపథ్యం ఉన్న వ్యక్తిని పంపించేశారనే అపవాదు వస్తుందని, అలాగని వదిలేస్తే మిగిలిన నేతలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని పార్టీ ఆందోళన చెందుతోంది.మొత్తానికి, తిరువూరు ఎమ్మెల్యే వ్యవహారం టీడీపీలో ఒక 'ముల్లు'లా మారింది. అభివృద్ధి జరగడం లేదని ఆయన అంటున్న మాటలు వాస్తవమా లేక వ్యక్తిగత ప్రయోజనాల కోసం చేస్తున్న రచ్చా అన్నది పక్కన పెడితే, ఇది కూటమి ప్రభుత్వ ప్రతిష్టను మాత్రం దెబ్బతీస్తోంది. కొలికపూడి స్వయంగా తప్పుకుంటారా లేక పార్టీయే వేటు వేస్తుందా అన్నది వేచి చూడాలి.

# వైసీపీ మౌనం - వ్యూహమా? వైఫల్యమా

విజయవాడ, ఫిబ్రవరి 11 ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగడానికి సమయం దగ్గరపడుతుండటంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మార్చి 9 నాటికి ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో రాజకీయ పార్టీలు అలర్ట్ అయ్యాయి. ఈ తరుణంలో ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పా అనుసరిస్తున్న మౌనం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను కలవరపెడుతోంది. ఎన్నికలకు సిద్ధమవుతున్న దాఖలాలు కనిపించకపోవడంతో, గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరించినట్లే.. ఇప్పుడు కూడా అదే బాటలో నడుస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది.సాధారణంగా ఎన్నికల షెడ్యూల్ సూచనలు రాగానే అభ్యర్థుల ఎంపిక, కమిటీల నియామకంపై పార్టీలు కసరత్తు చేస్తాయి. కానీ వైసీపీలో ప్రస్తుతం అటువంటి సందడి ఎక్కడా కనిపించడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత క్యాడర్‌ను తిరిగి సమీకరించడంలో నాయకత్వం కొంత తడబడుతున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అధికార కూటమి దూకుడుగా ఉండటం, పోలీసులు , అధికార యంత్రాంగంపై తమకు నమ్మకం లేదని గతంలోనే పార్టీ ప్రకటించినందున , పోటీకి దూరంగా ఉండటమే మేలనే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు సంకేతాలు వస్తున్నాయి. ఎన్నికలను బహిష్కరిస్తే పరువు దక్కుతుందనేది ఒక వాదన అయితే, అది పార్టీ మనుగడకే ముప్పు అనే సంకేతాలు క్షేత్రస్థాయి నుంచి అందుతున్నాయి. స్థానిక ఎన్నికలు అంటే కేవలం పార్టీ గెలుపోటములే కాదు, గ్రామాల్లో నాయకులు తమ ఉనికిని కాపాడుకునే అవకాశం. ఒకవేళ పార్టీ పోటీ చేయకపోతే, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు రాజకీయంగా అనాథలయ్యే ప్రమాదం ఉంది. పోటీలో లేకపోతే క్యాడర్ నిరుత్సాహపడి, తమ రాజకీయ భవిష్యత్తు కోసం అధికార కూటమి వైపు లేదా ఇతర ప్రత్యామ్నాయాల వైపు చూసే అవకాశం ఉంది.రాజకీయాల్లో మైదానం వదిలి వెళ్లడం ఎప్పుడూ సరైన సంకేతం కాదు. 2024 ఎన్నికల తర్వాత వైసీపీ గ్రాఫ్ తగ్గుతూ వస్తోందని ప్రత్యర్థులు ప్రచారం చేస్తున్న తరుణంలో, స్థానిక ఎన్నికల నుంచి తప్పుకోవడం ఆ ప్రచారానికి బలం చేకూర్చినట్లు అవుతుంది. ఎన్నికల్లో ఓడినా పోరాడామనే ముద్ర ఉంటే భవిష్యత్తుపై ఆశ ఉంటుంది, కానీ పోటీనే చేయకపోతే పార్టీ బలహీనపడిందనే ముద్ర శాశ్వతంగా పడిపోయే ప్రమాదం ఉంది. ఇది పార్టీ నుంచి వలసలను ప్రోత్సహించడమే కాకుండా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీ యంత్రాంగాన్ని దెబ్బతీస్తుందన్న ఆందోళన ఆ పార్టీ క్యాడర్‌లో వ్యక్తమవుతోంది. వైసీపీ నాయకత్వం ఈ ప్రచారాన్ని ఖండించి, కేడర్‌లో ధైర్యం నింపాల్సిన అవసరం ఉంది. అధికార పార్టీ అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూనే, ప్రజాక్షేత్రంలో పోరాటం చేయడం ద్వారానే కోల్పోయిన వైభవాన్ని తిరిగి తెచ్చుకోవచ్చు. పరీక్షల లోపే ఎన్నికలు పూర్తి చేయాలనే ప్రభుత్వ ఆలోచనకు తగ్గట్టుగా, పార్టీ తన వ్యూహాన్ని మార్చుకోవాల్సి ఉంటుంది. లేనిప క్షంలో, ఈ స్థానిక ఎన్నికలు వైసీపీ ఉనికికి పెద్ద పరీక్షగా మారే అవకాశం ఉందన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో వినిపిస్తోంది.

ఎమ్మెల్సీ ఎన్నికలు బాయ్ కాట్

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీకాలం మార్చి 17తో, గ్రామ పంచాయతీల గడువు ఏప్రిల్ 2తో ముగియనుంది. ఈ నేపథ్యంలో మార్చిలోనే ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం, ఎన్నికల సంఘం కసరత్తు వేగవంతం చేశాయి. సాధారణంగా ఎన్నికల షెడ్యూల్ సంకేతాలు రాగానే పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక, కమిటీల నియామకంతో సందడి నెలకొంటుంది. కానీ, వైసీపీ క్యాంపులో కనిపిస్తున్న నిశ్శబ్దం పలు అనుమానాలకు తావిస్తోందిగతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను వైసీపీ బహిష్కరించిన ఉదాహరణలు ఉన్నాయి. ఇప్పుడు స్థానిక ఎన్నికల విషయంలోనూ పార్టీ నాయకత్వం అదే ఆలోచనలో ఉందన్న ప్రచారం సాగుతోంది. ఇందుకు అనేక కారణాలు కూడా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పోలీసులు, అధికార యంత్రాంగం అధికార కూటమికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వరని వైసీపీ ఆరోపిస్తోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ద్వితీయ శ్రేణి నాయకత్వం ఇంకా కోలుకోలేదు. ఆర్థికంగా, సామాజికంగా దాడులు ఎదుర్కొంటున్న తరుణంలో ఎన్నికల బరిలోకి దిగడం సాహసమేనని కొందరు భావిస్తున్నారు. ఓడిపోతే వచ్చే పరాభవం కంటే, వ్యవస్థలపై నిరసనగా పోటీకి దూరంగా ఉన్నామని చెప్పడం ద్వారా పార్టీ పరువు కాపాడుకోవచ్చనేది కొందరి వాదన.రాజకీయాల్లో 'మైదానం వదిలి వెళ్లడం' అంటే ప్రత్యర్థికి వాకోవర్ ఇవ్వడమే. స్థానిక ఎన్నికలు కేవలం గెలుపోటములకే పరిమితం కావు, అవి పార్టీ గ్రామస్థాయి ఉనికిని చాటుకునే అవకాశం కల్పిస్తాయి. పార్టీ పోటీ చేయకపోతే దశాబ్దాలుగా జెండా మోసిన కార్యకర్తలు రాజకీయంగా అనాథలవుతారు. తమ ఉనికి కోసం వారు అధికార కూటమి వైపు లేదా ఇతర ప్రత్యామ్నాయాల వైపు చూసే ప్రమాదం ఉంది. ఇప్పటికే కీలక నేతలు పార్టీని వీడుతున్న తరుణంలో, ఎన్నికల నుంచి తప్పుకుంటే పార్టీ పూర్తిగా బలహీనపడిందనే ముద్ర పడుతుంది. ఇది పార్టీ నుంచి భారీ వలసలకు దారితీసే అవకాశం ఉంది.రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. పోరాటం చేయకుండా తప్పుకోవడం వల్ల వైసీపీకి దీర్ఘకాలికంగా నష్టమే జరుగుతుంది. ఓడినా పోరాడామనే ముద్ర ఉంటేనే క్యాడర్‌లో భవిష్యత్తుపై ఆశ చిగురిస్తుంది. వైసీపీ నాయకత్వం అధికార పార్టీ అక్రమాలను ఎండగడుతూనే, ప్రజాక్షేత్రంలో గట్టిగా నిలబడాలి.మార్చిలో జరగబోయే ఈ స్థానిక ఎన్నికలు వైసీపీకి ఒక "లిట్మస్ టెస్ట్" లాంటివి. ఈ పరీక్షలో పోటీ చేసి ఉనికిని చాటుకుంటుందో లేక బహిష్కరణ పేరుతో వెనకడుగు వేస్తుందో వేచి చూడాలి. ఏదేమైనా, ఈ నిర్ణయం ఏపీ రాజకీయాల్లో వైసీపీ భవిష్యత్తును నిర్ణయించబోతోంది.

# జీడీపీలో వైజాగ్ ఫస్ట్

విశాఖపట్టణం, ఫిబ్రవరి 11,ఏపీ ప్రభుత్వం జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం లెక్కలు విడుదల చేసింది. విశాఖపట్నం టాప్ ప్లేస్‌లో నిలిచింది. సీఎం చంద్రబాబు మంత్రులు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం ప్రతి ఐదేళ్లకూ రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలని చంద్రబాబు అధికారుల్ని ఆదేశించారు. ప్రజల జీవన ప్రమాణాలకు తలసరి ఆదాయం ప్రతీక అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయంలో విశాఖపట్నం అదరగొట్టింది.. మొదటి స్థానంలో నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా స్థూల ఉత్పత్తిలో రెండో స్థానంలో నిలిచింది. అయితే తలసరి ఆదాయంలో మాత్రం మూడో ప్లేస్‌లో నిలిచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. జాతీయ ఆర్థిక సర్వే, జీఎస్‌డీపీ, జీడీపీలపై అధికారులతో చర్చించారు. ఈ మేరకు ప్రభుత్వం జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం గణాంకాలను (2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ముందస్తు అంచనాలు) విడుదల చేసింది.జిల్లాల వారీగా జీడీపీ ముందస్తు అంచనాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం- రూ.1,60,771 కోట్లు, ఎన్టీఆర్ జిల్లా- రూ.1,05,173 కోట్లు, కృష్ణా జిల్లా-రూ.98,801 కోట్లు, తిరుపతి జిల్లా-రూ.98,526 కోట్లు, ఏలూరు జిల్లా- రూ.88,543 కోట్లు, నెల్లూరు జిల్లా-రూ.85,444 కోట్లు, గుంటూరు జిల్లా-రూ.83,618 కోట్లు, కడప జిల్లా- రూ.79,617 కోట్లు, అనంతపురం జిల్లా- రూ.76,849 కోట్లు, కాకినాడ జిల్లా-75,342 కోట్లు, పశ్చిమ గోదావరి జిల్లా-రూ.73,970 కోట్లు, తూర్పుగోదావరి జిల్లా-రూ.70,512 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లా-రూ.63,190 కోట్లు, అనకాపల్లి జిల్లా-రూ.60,146 కోట్లు, కర్నూలు జిల్లా-రూ.54,452 కోట్లు, పల్నాడు జిల్లా- రూ.49,596 కోట్లు, చిత్తూరు జిల్లా రూ.49,303 కోట్లు, నంద్యాల జిల్లా-రూ.48,531 కోట్లు, బాపట్ల జిల్లా-రూ.48,457 కోట్లు, శ్రీకాకుళం జిల్లా-రూ.47,663 కోట్లు, ప్రకాశం జిల్లా- రూ.46,268 కోట్లు, విజయనగరం జిల్లా రూ.45,085 కోట్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా- రూ.44,859 కోట్లు, అన్నమయ్య జిల్లా రూ.36,035 కోట్లు, మార్కాపురం జిల్లా- రూ.29,031 కట్లు, అల్లూరి సీతారామరాజు జిల్లా రూ.18,583 కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లా రూ.17,271 కోట్లు, పోలవరం జిల్లా- రూ.6,723 కోట్లు. జిల్లాల వారీగా తలసరి ఆదాయం చూస్తే.. విశాఖపట్నం-6,58,091, కృష్ణా-4,82,078, ఎన్టీఆర్ జిల్లా-3,91,390.. వరుసగా మూడు స్థానాల్లో ఉన్నాయి'ప్రతీ ఐదేళ్లకూ జీఎస్డీపీ, తలసరి ఆదాయం రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలి. తలసరి ఆదాయం ప్రజల జీవన ప్రమాణాలకు ప్రతీకగా నిలుస్తుంది. కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల విషయంలో జాగ్రత్తగా అంచనాలు వేయాలి. క్షేత్రస్థాయి నుంచి తీసుకునే సమాచారం ఒకటికి రెండు సార్లు పరిశీలన చేసుకోవాలి. పీ 4 అనేది రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తగ్గించే ప్రత్యేక కార్యక్రమం. మార్గదర్శులు బంగారు మిత్రలను నియమించుకోవాలి.. వారి ద్వారా ఆయా పేద కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలి. గత పాలకులు చేసిన అప్పుల కారణంగా 14 శాతం వడ్డీ చెల్లిస్తున్నాం. ఏపీ క్రెడిట్ రేటింగ్ పెంచుకుని వడ్డీ తగ్గించుకునేలా రుణాలన్నీ రీషెడ్యూలు చేస్తున్నాం. గత పాలనలో పాలకులు 2019-24 మధ్య ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతీశారు. జీతాలు కూడా మొదటి తేదీకి ఇవ్వలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు జీతాల చెల్లింపులను గాడిలో పెట్టాం.. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం. కొన్ని జిల్లాల్లో అద్భుతమైన అభివృద్ధి జరుగుతోంది. భవిష్యత్తులో ఆ జిల్లాలు మరింత వృద్ధిలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి' అన్నారు చంద్రబాబు.పారిశ్రామిక కాలుష్యం ద్వారా భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడాలి. సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందాలి. ఆశ్రమ హాస్టల్‌లో కలుషితమైన నీరు కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురైన పరిస్థితి ఎదురైంది. ఈ తరహా ఘటనలు ఇక రాష్ట్రంలో ఉత్పన్నం కాకూడదు. మళ్లీ ఇలాంటి సంఘటనలు జరిగితే... దానికి సంబంధిత జిల్లా కలెక్టర్, ఇంచార్జ్ మంత్రులదే బాధ్యత. పంచాయితీరాజ్ రోడ్లు, నీటి సంరక్షణా చర్యలు, గోకులం షెడ్లు, మేజిక్ డ్రెయిన్లు చేపట్టాలి' అని సూచించారు.

# ఆస్తి పన్ను బకాయిలుంటే ఆస్తులు సీజ్

విశాఖపట్టణం, ఫిబ్రవరి 11, విశాఖపట్నంలో ఆస్తి పన్ను బకాయిల వసూళ్లపై జీవీఎంసీ అధికారులు ఫోకస్ పెట్టారు. నగరంలో మొండి బకాయిలను వసూలు చేసేందుకు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఆస్తి పన్ను బకాయి ఉన్నవారికి ముందుగా నోటీసులు ఇస్తున్నారు.. ఒకవేళ వారు స్పందించని పక్షంలో ఆస్తుల దగ్గర బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అప్పటికి చెల్లించినవారికి ఊహించని షాకిస్తున్నారు.. ఆ ఆస్తుల్ని సీజ్ కూడా చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు కఠినగా వ్యవహరిస్తుండటంతో పెండింగ్ బకాయిలు ఒక్కొక్కటిగా వసూలవుతున్నాయివిశాఖపట్నం జీవీఎంసీ పరిధిలో 6,02,937 ఆస్తి పన్ను అసెస్‌మెంట్‌లు ఉంటే.. ఆ ఆర్థిక సంవత్సరంలో రూ.566.41 కోట్లు పన్ను రావాలి. అయితే ఇప్పటి వరకు రూ.360 కోట్లు మాత్రమే చెల్లించగా.. మిగిలిన మొండి బకాయిల్ని కూడా రాబట్టేందుకు సిద్ధమయ్యారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మొండి బకాయిలపై ఫోకస్ పెట్టారు.. ఆస్తి పన్ను బకాయి ఉన్నవారికి వరుసగా నోటీసులు జారీ చేస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో లక్షా 36వేల 149మంది ఆస్తి పన్ను చెల్లించాల్సిన వారు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.. వీరందరికి జప్తు నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు వెళ్లాయి. వీరిలో లక్షా 10వేల 136మందికి అధికారులు నోటీసులు ఇచ్చారు.. అయితే వీరిలో కూడా కొందరి నుంచి స్పందన రాలేదు. ఈ క్రమంలో వారి ఆస్తుల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఆ నోటీసులు పన్ను బకాయి వివరాలు ఉన్నాయి.. ఒకవేళ అప్పటికి ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోతే.. వారి ఆస్తులను సీజ్ చేస్తున్నారు అధకారులు.ఇటీవల నగరంలోని ఓ సంస్థ మూడేళ్ల నుంచి రూ.87,74,916 పన్ను చెల్లించడం లేదు.. వారికి జప్తు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. ఈ క్రమంలో అధికారులు ఆ సంస్థ ముందు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అలాగే మరో సంస్థ ఏకంగా ఐదేళ్ల నుంచి పన్ను చెల్లించడంలేదు.. అక్కడ కూడా హెచ్చరిక బోర్డ్ ఏర్పాటు చేశారు. మరో వ్యక్తి తొమ్మిదేళ్ల నుంచి ఆస్తి పన్ను చెల్లించలేదు.. అక్కడ కూడా బోర్డు పెట్టారు. ఇలా బోర్డు పెట్టినా పన్ను చెల్లించనివారి ఆస్తుల్ని సీజ్ చేస్తున్నారు. ఈ తాజా పరిణామాలతో చాలామంది పన్నులు వసూలు చేస్తుండగా.. కొందరు మాత్రం వేచి చూసే ధోరణిలో ఉన్నారు.ఇదిలా ఉంటే.. విశాఖపట్నం జిల్లా తలసరి ఆదాయంలో నంబర్ వన్‌గా ఉంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. సీఎం సోమవారం రోజు మంత్రులు, కార్యదర్శులలతో అమరావతిలో సమీక్షా సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. జిల్లా కలెక్టర్లు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో గత ఏడాది విశాఖపట్నం జిల్లా.. స్థూల ఉత్పత్తిలో రూ.1,44,192 కోట్లతో ప్రథమ స్థానంలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో కూడా రూ.1,60,771 కోట్లతో ఫస్ట్ ప్లేస్‌లో నిలబడింది.

## బీఆర్ఎస్ ఏజెంట్ ను అడ్డుకున్న పోలీసులు

మంచిర్యాల జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసుల ఓవర్ యాక్షన్ చూపించారు. లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 9,10 పోలింగ్ కేంద్రాల వద్ద బీఆర్ఎస్ ఏజెంట్గా ఉన్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ ను పోలీసులు పోలింగ్ బూత్ లోపలికి వెళ్లకుండా అడ్డుకుని, నెట్టివేసారు. దాంతో అయనే పోలీసుల తీరును నిరసిస్తూ పోలింగ్ కేంద్రం ఎదురుగా రోడ్డుపై బైఠాయించి ఆందోళన వ్యక్తం చేసారు.

## రహదారి భద్రతపై పోలీసుల వినూత్న ప్రచారం: టోల్ ప్లాజా వద్ద వాహనదారులచే 'హెల్మెట్' ధారణ ప్రమాణం!




ఒంగోలు టంగుటూరు టోల్ ప్లాజా వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను ఆపి, వారికి రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదాల్లో తలకు తగిలే గాయాలే మరణాలకు ప్రధాన కారణమని, హెల్మెట్ ప్రాణ రక్షక కవచంలా పనిచేస్తుందని పోలీసులు వివరించారు. అనంతరం వాహనదారులందరిచే "నేటి నుండి ప్రయాణంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తాం" అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ మాట్లాడుతూ.. కుటుంబ సభ్యుల క్షేమం కోసమైనా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. పోలీసుల ఈ వినూత్న చొరవను ప్రయాణికులు మరియు స్థానికులు అభినందించారు.

## మహబూబ్నగర్ కార్పొరేషన్లో పోలింగ్ కేంద్రాల సందర్శన భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ సమీక్ష




మహబూబ్ నగర్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మహబూబ్నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, మహబూబ్నగర్ కార్పొరేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీ బ్రిలియంట్ స్కూల్, ఠాగూర్ స్కూల్, గాంధీ రోడ్ స్కూల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎస్పీ గారు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, సిబ్బంది విధులు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, క్యూలైన్ నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అక్కడి అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన సూచనలు చేశారు.

జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని తెలిపారు. సీఐలు, డీఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్సులు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు విధులు నిర్వర్తిస్తూ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నాయని పేర్కొన్నారు. అదనంగా రూట్ మొబైల్ బృందాలు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ శాంతి భద్రతలను కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తున్నాయని వివరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యే వరకు పోలీసులు పూర్తి అప్రమత్తంగా ఉంటారని తెలిపారు.

## కొరకరాని కొయ్యగా విష్ణుకుమార్ రాజు

విశాఖపట్టణం, ఫిబ్రవరి 11, కూటమి ప్రభుత్వంలో విశాఖ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కొరకరాని కొయ్యగా మారారు. ఆయన వ్యాఖ్యలు ప్రభుత్వంతో పాటు కూటమిని కూడా ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. వరసగా ఆయన ప్రభుత్వానికి, కూటమికి వ్యతిరేకంగా చేస్తున్న వ్యాఖ్యలు ప్రజల్లోకి బలంగా వెళుతున్నాయి. విష్ణుకుమార్ రాజు రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014లో బీజేపీ నుంచి గెలిచిన విష్ణుకుమార్ రాజు 2024 అంటే పదేళ్ల తర్వాత మళ్లీ ఎన్నికయ్యారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఆయన రూటు మారింది. గతంలో వైసీపీ ప్రభుత్వం పై విరుచుకుపడిన విష్ణుకుమార్ రాజు ఇప్పుడు అధికార పక్షంలో ఉంటూ కూడా తాను ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. విష్ణుకుమార్ రాజు కొంత ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉన్నందున ఆయన ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారన్నకామెంట్స్ కూడా ఎక్కువగా వినపడుతున్నాయి. ఇటీవల రుషికొండ ప్యాలెస్ పై మంత్రి వర్గ ఉప సంఘం తీసుకున్న నిర్ణయాన్ని విష్ణుకుమార్ రాజు తప్పు పట్టారు. దానిని స్టార్ హోటల్ కు ఇస్తే సామాన్యులకు ఎలా ప్రవేశం దొరకుతుందని ఆయన సూటిగానే ప్రశ్నించి ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టారు. తర్వాత భోగాపురం ఎయిర్ పోర్టు లో ట్రయల్ రన్ పూర్తయిన సందర్భంగా కూడా విష్ణుకుమార్ రాజు వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. భోగాపురం విమానాశ్రయానికి వెళ్లే కంటే విశాఖ నుంచి విజయవాడకు వందేభార్ రైలులో వెళితే సమయం ఆదాఅవుతుందని చెప్పి ఇబ్బందిలోకి నెట్టారు. రైల్వే మంత్రికి విశాఖ నుంచి విజయవాడకు వందే భారత్ రైళ్లు వేయాలని తాను కోరతానని విష్ణుకుమార్ రాజు చెప్పారు. ఇక గూగుల్ డేటా సెంటర్ పై కూడా ఆయన వ్యాఖ్యలు కూటమి పార్టీలో కలకలం రేపాయి. గూగుల్ డేటా సెంటర్ వస్తే విశాఖ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని, పర్యావరణం దెబ్బతింటుందన్న ఆందోళలనను విష్ణుకుమార్ రాజు చేశారు. గూగుల్ డేటా సెంటర్ తీసుకు వచ్చిన ఆనందాన్ని కూటమి నేతల్లో విష్ణు ఆవిరి చేసిపారేశారు. ఇక తాజాగా మాజీ మంత్రులు, అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై దాడులను కూడా ఖండించారు. అలా ఇళ్ల మీద దాడులు చేయడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. అయితే విష్ణుకుమార్ రాజు పబ్లిక్ పల్స్ మాత్రమే చెబుతున్నానని అంటున్నారు.

ప్రజలు అనుకుంటున్నదే తాను అంటున్నానని, ప్రభుత్వం మార్చుకుంటే మంచిదని సూచిస్తున్నారు. మొత్తం మీద బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తనకు మంత్రి పదవి రాలేదన్న ఆగ్రహంతోనే ఈ వ్యాఖ్యలు చేస్తుండ ఉండి వచ్చని కూటమి నేతలు అంటున్నారు.

## శివకుమార్ పట్టాభిషేకానికి ముహూర్తం ఫిక్స్ ?



బెంగళూరు, ఫిబ్రవరి 11 కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి. ఇప్పటివరకూ తెర వెనుక సాగిన సీఎం మార్పు చర్చలు ఇప్పుడు బాహాటంగా రోడ్డుపైకి వచ్చాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్థానంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కూర్చోబెట్టాలంటూ ఎమ్మెల్యేలు బహిరంగంగా డిమాండ్ చేయడం కన్నడ రాజకీయాల్లో భూకంపాన్ని సృష్టిస్తోంది. తాజా రాజకీయ ప్రకంపనలకు కేంద్ర బిందువు ఎమ్మెల్యేలు ఇక్బాల్ హుస్సేన్, చెన్నరాజ్ హట్టిహోలి. వీళ్లిద్దరూ డీకేకు కేవలం మద్దతు తెలపడమే కాకుండా, హైకమాండ్ ముందున్న లెక్కలను కూడా బయటపెట్టారు. పార్టీ కోసం రక్తం చిందించిన డీకేకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఇప్పటికే 80 నుండి 90 మంది ఎమ్మెల్యేలు అధిష్టానానికి ఈ మేరకు విజ్ఞప్తి చేసినట్లు ఆయన బహిరంగంగానే వెల్లడించారు. దీనికి మరో ఎమ్మెల్యే చెన్నరాజ్ హట్టిహోలి మరింత బలాన్ని చేకూర్చారు. "80 మంది కాదు, కాంగ్రెస్ నుంచి గెలిచిన మొత్తం 136 మంది ఎమ్మెల్యేలూ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు" అని ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు ఏదో యాదృచ్ఛికంగా చేసినవి కావని, సిద్ధరామయ్య క్యాంప్‌కు ఒక స్పష్టమైన హెచ్చరిక లాంటివని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 2023 మేలో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ ఈ సీటుపై గందరగోళం కొనసాగుతూనే ఉంది. ఎన్నికల్లో కాంగ్రెస్ అఖండ విజయం సాధించిన తర్వాత సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం పీఠం కోసం పెద్ద యుద్ధమే జరిగింది. అప్పట్లో ఢిల్లీ పెద్దలు కుదిర్చిన '30 నెలల ఫార్ములా' అంటే రెండున్నరేళ్ల ఒప్పందం ఇప్పుడు డీకే వర్గానికి అస్త్రంగా మారింది. ఆ గడువు ముగియడంతోనే, ఎమ్మెల్యేలు ఇప్పుడు తమ గళాన్ని పెంచారు. సాధారణంగా ఏ పార్టీలోనైనా ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తికి వ్యతిరేకంగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం క్రమశిక్షణారాహిత్యం కిందకు వస్తుంది. కానీ, డీకే శివకుమార్ అనుచరులు ఇంత ధైర్యంగా మాట్లాడుతున్నారంటే దీని వెనుక బలమైన స్కెచ్ ఉంది. సిద్ధరామయ్య ప్రజాకర్షణ ముందు డీకే వెనుకబడిపోకుండా, ఎమ్మెల్యేల బలం తనకే ఉందని నిరూపించుకోవడం దీని వెనుక ఉద్దేశం. సిద్ధరామయ్య తన 'అహింద' ఓటు బ్యాంకుతో పట్టు బిగిస్తుంటే, డీకే తన 'ఒక్కలిగ' సామాజిక వర్గ ఎమ్మెల్యేలను ఏకం చేస్తున్నారు. సిద్ధరామయ్య చుట్టూ ముదురుతున్న ముడా కేసు దర్యాప్తును ఆసరాగా చేసుకుని, నైతికత పేరుతో పదవిని బదిలీ చేయాలని కోరడం కూడా దీని వెనుక వ్యూహం కావచ్చు. ఎమ్మెల్యేలు బహిరంగంగా ప్రకటనలు చేస్తుంటే అధిష్టానం మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. సిద్ధరామయ్యను తప్పిస్తే వెనుకబడిన వర్గాలు ఏమౌతాయి? డీకేకు అవకాశం ఇవ్వకపోతే పార్టీకి ఆర్థిక బలం, ట్రబుల్ షూటింగ్ నెరవేరుతుందా? అనే సంకటంలో ఢిల్లీ పెద్దలు ఉన్నారు. మొత్తానికి ఎమ్మెల్యేల బహిరంగ వ్యాఖ్యలు కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు కేవలం ఊహాగానం కాదు, ఒక కార్యాచరణ అని స్పష్టం చేస్తోంది. డీకే శివకుమార్ వ్యూహాత్మకంగా తన అనుచరుల ద్వారా పావులు కదుపుతున్నారు. త్వరలోనే తనకు పట్టాభిషేకం ఖాయమనే ఆలోచనలో డీకే ఉన్నారు. ఆయన అనుచరుల తాజా వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. హైకమాండ్ పైన ఒత్తిడి తీసుకురావడం ద్వారా తమ పంచాన్ని నెగ్గించుకోవాలనుకుంటున్నారు. మరి సిద్ధరామయ్య ఈ ఎమ్మెల్యేల అస్త్రం నుండి తన కుర్చీని ఎలా కాపాడుకుంటారో చూడాలి.

## అధికారంలో ఎవరుంటే వారితో దోస్తీ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 తెలంగాణ రాజకీయాల్లో మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీది ఒక ప్రత్యేకమైన శైలి. ఇటీవల అక్బరుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. "రెడ్డి అయినా, రావు అయినా తమ దగ్గరకు రావాల్సిందే" అని ఆయన అన్నారు. అయితే, ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న రాజకీయ చతురతను, గత కొన్ని దశాబ్దాల ఎంఐఎం ప్రస్థానాన్ని పరిశీలిస్తే, ఇది కేవలం ఒక పార్టీ ఆధిపత్యం మాత్రమే కాదు.., అధికార పార్టీలు, ఎంఐఎం మధ్య ఉన్న 'పరస్పర ప్రయోజనాల' బంధమని స్పష్టమవుతుంది. ఎంఐఎం పార్టీ పుట్టినప్పటి నుంచి అనుసరిస్తున్న ఏకైక సూత్రం "అధికారంలో ఎవరుంటే వారితో దోస్తీ" చేయడం. ఇది సిద్ధాంతాల కంటే ఎక్కువగా ప్రయోజనాల మీద ఆధారపడి ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ హయాం నుంచి మొదలుకొని, నేటి తెలంగాణ వరకు ఈ ధోరణి కొనసాగుతూనే ఉంది. గతంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొంత దూరం ఉన్నప్పటికీ, ఆ తర్వాత వచ్చిన చంద్రబాబు హయాంలోనూ, ఆపై వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలోనూ ఎంఐఎం అత్యంత కీలక పాత్ర పోషించింది. కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో పాతబస్తీలో జరిగిన కొన్ని పరిణామాల వల్ల ఎంఐఎం కాంగ్రెస్‌కు దూరమైంది. కానీ, రాష్ట్ర విభజన తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే, కేసీఆర్‌తో ఫ్రెండ్లీ బంధాన్ని కొనసాగించింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్‌తోనూ అదే తరహా అనుబంధాన్ని కొనసాగిస్తోంది. అక్బరుద్దీన్ ఓవైసీ అన్నట్లుగా పార్టీలే తమ దగ్గరకు వస్తాయా? లేక వీరే వెళ్తారా? అనేది ఒక నాణేనికి ఉన్న రెండు పార్శ్వాల వంటిది. కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ వంటి పార్టీలకు ముస్లిం ఓటు బ్యాంకు కీలకం. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30-40 నియోజకవర్గాల్లో ముస్లిం ఓటర్లు గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నారు. ఎంఐఎంతో దోస్తీ చేయడం వల్ల మైనారిటీల్లో ఒక 'పాజిటివ్ మెసేజ్' వెళ్తుందని, తద్వారా ఆయా వర్గాల ఓట్లు తమకే పడతాయని అధికార పార్టీలు భావిస్తాయి. ఎంఐఎం బలం కేవలం పాతబస్తీలోని ఏడు అసెంబ్లీ స్థానాలకే పరిమితం. పాతబస్తీలో తమ పట్టును నిలుపుకోవాలన్నా, తమ నియోజకవర్గాలకు నిధులు కావాలన్నా, లేదా తమ మద్దతుదారుల వ్యాపార సామ్రాజ్యాలకు రక్షణ ఉండాలన్నా అధికారంలో ఉన్న పార్టీతో సత్సంబంధాలు ఎంఐఎంకు అత్యవసరం. జూబ్లీహిల్స్ బైపోల్ ప్రస్తావన తెస్తూ అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఆసక్తికరమైనవి. అయితే మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చినట్లుగా, ప్రతి నియోజకవర్గంలోనూ సమీకరణాలు వేరుగా ఉంటాయి. జూబ్లీహిల్స్ వంటి చోట్ల ఎంఐఎంకు గణనీయమైన ఓట్లు ఉన్నప్పటికీ, గెలుపు అనేది అభ్యర్థి వ్యక్తిగత బలం, అధికార పార్టీ మేనిఫెస్టోపై కూడా ఆధారపడి ఉంటుంది. ఇక్కడ ఎంఐఎం మద్దతు 'అదనపు బలం' కావొచ్చు కానీ, అదే 'ఏకైక బలం' అని చెప్పలేం. నిజానికి ఎంఐఎం ఎప్పుడూ 'కింగ్ మేకర్' కావాలని కోరుకోదు. ఎందుకంటే కింగ్ మేకర్ కావాలంటే ప్రభుత్వాలు పడిపోయే స్థితిలో ఉండాలి. కానీ తెలంగాణలో మెజారిటీ ప్రభుత్వాలు ఉన్నా ఎంఐఎం వారితో స్నేహం చేస్తుంది. అంటే వారు 'కింగ్ తో ఉండే పార్టీ'గా ఉండటానికే ఇష్టపడతారు. దీనివల్ల ప్రభుత్వ నిర్ణయాల్లో తమ మాట చెల్లుబాటు అవుతుంది. పోలీస్ యంత్రాంగం, పరిపాలనలో పాతబస్తీపై తమ గుత్తాధిపత్యం కొనసాగుతుంది. విపక్షంలో ఉండి పోరాటాలు చేసే శ్రమ తప్పుతుంది. అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు తమ కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికి, తమ ప్రాధాన్యతను తగ్గకుండా చూసుకోవడానికి చేసిన 'మైండ్ గేమ్'గా విశ్లేషకులు భావిస్తున్నారు. రెడ్డి అయినా, రావు అయినా చివరకు రాజకీయ ప్రయోజనాల కోసం ఒకరిపై ఒకరు ఆధారపడక తప్పని పరిస్థితి తెలంగాణలో ఉంది. ఎంఐఎంకు అధికారం కావాలి, అధికార పార్టీకి ముస్లిం ఓట్లు కావాలి. ఈ సమీకరణం ఉన్నంత కాలం "ఎవరు ఎవరి దగ్గరకు వెళ్లారు" అనే చర్చ కంటే, "ఎవరు ఎవరిని ఎంత ఉపయోగించుకున్నారు" అనేదే అసలైన రాజకీయం. అక్బరుద్దీన్ వ్యాఖ్యలు కేవలం పైన కనిపించే కోణం మాత్రమే.. లోపల ఉన్నది మాత్రం పక్కా రాజకీయ అవసరాల బంధం.

## పేద రోగులకు రోబోటిక్ విధానంలో ఫ్రీగా సర్జరీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పేద రోగులకు ఎంఎన్‌జే ఆసుపత్రిలో ఉచితంగా సర్జరీలు చేస్తున్నారు. రోబోటిక్ విధానంలో రోగులకు ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్సలు చేస్తున్నారు. గత రెండున్నరేళ్లలో ఆసుపత్రిలో రూ.12.5 కోట్ల విలువైన సర్జరీలు చేసినట్లు వైద్యులు వెల్లడించారు. పేద రోగులకు నిజంగా ఇది వరమనే చెప్పాలి. హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో పేద రోగులకు రోబోటిక్ విధానంలో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నారు. అవి కూడా ఉచితంగా. గడిచిన 30 నెలల వ్యవధిలో దాదాపు రూ.12.5 కోట్ల విలువైన రోబోటిక్ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సేవలను ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా పేద రోగులకు అందిస్తున్నారు. గత రెండున్నరేళ్లలో రికార్డు స్థాయిలో 250 వరకు రోబోటిక్ సర్జరీలు చేశారు. హైదరాబాద్ నగరం నుంచే కాకుండా ఇతర జిల్లాలు, సరిహద్దు రాష్ట్రాల నుంచి ప్రతి రోజూ 700-800 వరకు రోగులు క్యాన్సర్ చికిత్సల కోసం ఆసుపత్రిని ఆశ్రయిస్తుంటారు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా చాలామంది రోగులు వస్తుంటారు. సాధారణంగా ఒక రోబో సర్జరీకి ప్రైవేటు ఆసుపత్రిలో అయితే రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం ఎంఎన్‌జేకు ఒక్కో రోబో సర్జరీకి రూ.1.5 లక్షల వరకు చెల్లిస్తోంది. కిడ్నీ, పెద్దపేగు, గ్యాస్ట్రిక్, గర్భసంచి, అన్నవాహిక, ప్రొస్టేట్ క్యాన్సర్లకు గతంలో కోత పెట్టి క్యాన్సర్ గడ్డలను తొలగించే వారు. అయితే అతి చిన్న క్యాన్సర్ గడ్డలను తొలగించడానికి డాక్టర్లకు కొన్నిసార్లు సాధ్యమయ్యేది కాదు. అధిక రక్త స్రావంతో పేషెంట్లు ఎక్కువ రోజులు హాస్పిటల్స్‌లోనే ఉండాల్సి వచ్చేది. ప్రస్తుతం అత్యాధునిక సర్జికల్ రోబోతో అతి చిన్న కణతులను చాలా ఈజీగా తొలగిస్తున్నారు. ఎలాంటి కోత లేకుండానే.. నాలుగు రంధ్రాలతో రోబో చేతులు లోపలకు వెళ్లి క్యాన్సర్ గడ్డలను పూర్తిగా తొలగిస్తున్నాయి. డాక్టర్లకు చేతులు వణుకు సమస్య ఉంటే ఈ శస్త్రచికిత్సలు చాలా కష్టమయ్యేవి. ప్రస్తుతం రోబోలతో సర్జరీలు చేస్తుండటంతో ఆ పరిస్థితి లేదు. ఇన్‌ఫెక్షన్లకు ఆస్కారం కూడా చాలా తక్కువ. మహిళల్లో వచ్చే గర్భాశయ క్యాన్సర్‌కు రోబోటిక్ సహాయ శస్త్ర చికిత్స మంచి ఫలితాలు అందిస్తోంది. ఇక తెలంగాణలో వైద్యారోగ్యశాఖ బలోపేతానికి సర్కార్ కీలక చర్యలు తీసుకుంటుంది.

## ఏప్రిల్ లో తెలంగాణ జాగృతి

హైదరాబాద్, ఫిబ్రవరి 11 తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరో కీలక మలుపు తిరగబోతోంది. గత కొంతకాలంగా మౌనంగా ఉంటూనే తన వ్యూహాలకు పదును పెట్టిన మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సరికొత్త రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టబోతున్నారు. తన స్వచ్ఛంద సంస్థ 'తెలంగాణ జాగృతి'ని పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మార్చే ప్రక్రియ తుది దశకు చేరుకుంది. వచ్చే ఏప్రిల్ నెలాఖరులో లేదా మే మొదటి వారంలో ఈ నూతన పార్టీ అధికారికంగా ప్రజల ముందుకు రానుంది. కొత్త పార్టీ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే అన్ని సాంకేతిక, చట్టపరమైన చర్యలను కవిత బృందం పూర్తి చేసింది. గత నెలలోనే కేంద్ర ఎన్నికల సంఘానికి అవసరమైన అన్ని పత్రాలతో కూడిన దరఖాస్తును అందజేశారు. ఈసీఐ నిబంధనల ప్రకారం పార్టీ పేరు నమోదు, ఇతర వివరాల పరిశీలనకు సాధారణంగా రెండు నెలల సమయం పడుతుంది. అన్నీ సవ్యంగా సాగితే, ఉగాది పర్వదినం తర్వాత, ఏప్రిల్ ఆఖరి వారంలో ఒక మంచి ముహూర్తాన్ని చూసుకుని కవిత తన పార్టీ జెండా, ఎజెండాను ప్రకటించనున్నారు. భారత రాష్ట్ర సమితి ) నుంచి సస్పెన్షన్‌కు గురైన తర్వాత కవిత తన రాజకీయ పంథాను పూర్తిగా మార్చుకున్నారు. కేవలం తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల నాడిని తెలుసుకునేందుకు జాగృతి జనంబాట పేరుతో పర్యటనలు చేపట్టారు. కేవలం భావోద్వేగాల మీద కాకుండా, ప్రజా సమస్యల ప్రాతిపదికన పార్టీ విధానాలు ఉండాలని ఆమె భావిస్తున్నారు. వివిధ సామాజిక వర్గాల సమస్యలు, ఆర్థిక స్థితిగతులు, రైతాంగ ఇబ్బందులపై అధ్యయనం చేయడానికి 50 కమిటీలను ఏర్పాటు చేశారు. మేధావులు, విద్యార్థులు, కుల వృత్తుల వారితో సమావేశమై పార్టీ ఎజెండా రూపకల్పనలో వారి భాగస్వామ్యాన్ని తీసుకుంటున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన వారు, అమరవీరుల కుటుంబాలు 'జాగృతి' నీడలోకి రావాలని ఆమె బహిరంగంగానే విజ్ఞప్తి చేశారు. ఈ కొత్త పార్టీ రూపకల్పన వెనుక ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ టీం పని చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. సోషల్ మీడియా మేనేజ్‌మెంట్ నుండి క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ నిర్మాణ వరకు పీకే సలహాలను కవిత తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, రాబోయే జీహెచ్ఎంసీ ( ఎన్నికలే ఈ పార్టీకి మొదటి పరీక్ష కానున్నాయి. ఒకవేళ ఈసీఐ నుంచి గుర్తింపు సకాలంలో వస్తే, హైదరాబాద్ నగర వ్యాప్తంగా అభ్యర్థులను నిలబెట్టి తన సత్తా చాటాలని కవిత యోచిస్తున్నారు. తద్వారా వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ప్రధాన రాజకీయ శక్తిగా ఎదగాలన్నది ఆమె మాస్టర్ ప్లాన్. "నా రాజకీయ భవిష్యత్తు కోసం పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేసుకున్నాను. తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త చర్చకు ఈ పార్టీ నాంది పలుకుతుంది" అని కవిత ధీమా వ్యక్తం చేస్తున్నారు. 'సామాజిక తెలంగాణ' నినాదంతో, అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పార్టీ ఎజెండా ఉండబోతున్నట్లు సమాచారం.

# మీనాక్షి తెలంగాణ ఇన్ ఛార్జిగా ఉన్నారా



హైదరాబాద్, ఫిబ్రవరి 11 తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ లో జరుగుతున్న వ్యవహారాలను పట్టించుకోవడం లేదనిపిస్తోంది. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వివిధ చోట్ల రెబెల్స్ నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ ఎలాంటి చర్యలకు ఆమె దిగడం లేదు. పార్టీ పరంగా తీసుకోవాల్సిన నిర్ణయాల విషయంలో మీనాక్షి నటరాజన్ నానుస్తున్నారని అన్నారు. కనీసం మీనాక్షి నటరాజన్ రాష్ట్ర పార్టీలో జరుగుతున్న పరిణామాలను హైకమాండ్ కు అసలు చెబుతున్నారా? లేదా? అన్న అనుమానం కూడా ఉంది. ఆమె ఏదో ఇన్ ఛార్జిగా ఉన్నట్లే ఉంటున్నారు తప్పించి ఎలాంటి కఠిన నిర్ణయాల వంటి జోలికి వెళ్లడం లేదు. దీనిని అలుసుగా తీసుకుని కాంగ్రెస్ నేతలు కొందరు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయిమీనాక్షి నటరాజన్ రాహుల్ గాంధీ కోటరీలో వ్యక్తి అంటారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా నడుచుకుంటారనే ఆమెను తెలంగాణ వ్యవహారాల ఇన్ ఛార్జిగా నియమించారు. మీనాక్షి నటరాజన్ చాలా సింపుల్ గా ఉంటారు. గతంలో ఇన్ ఛార్జుల మాదిరిగా మీనాక్షి పార్టీ బలోపేతానికి తప్పించి మరే ఆలోచన చేయరు. తెలంగాణకు వస్తే హంగు ఆర్భాటాలను కూడా ప్రదర్శించరు. స్టార్ హోటల్స్ బస చేయరు. అలాగే ఏ స్థాయి నేత ఫోన్ చేసిన వెంటనే రెస్పాండ్ అవుతారు. అలాంటి మీనాక్షి నటరాజన్ గత కొద్ది రోజుల నుంచి తెలంగాణ కాంగ్రెస్ లో జరుగుతున్న పరిణామాలపై ఆమె స్పందించకపోవడం, పార్టీ అగ్ర నాయకత్వానికి కూడా తెలియజేయకపోవడంపైనే ఇప్పుడు గాంధీ భవన్ లో చర్చ జరుగుతుంది.మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి కానీ, పార్టీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలకు సంబంధించి అసలు పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళుతున్నారా? లేదా? అన్న అనుమానం కూడా నేతల్లో ఉంది. జీవన్ రెడ్డి వ్యవహారం తీసుకుంటే అది వెంటనే హైకమాండ్ కు చేరవేయాలి. ఆయన దశాబ్దాలుగా పార్టీలో ఉన్న నేత అని మీనాక్షికి తెలుసు. కనీసం ఆయన వద్దకు వెళ్లి మాట్లాడే ప్రయత్నం కూడా మీనాక్షి చేయలేదు. అంటే రాష్ట్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయాలను అమలు పర్చేదానికి ఇక ఇన్ ఛార్జి ఎందుకన్న సందేహం సాధారణంగా కార్యకర్తల్లోనూ వ్యక్తమవుతుంది. అప్పుడప్పుడు ఇలా వచ్చి అలా మౌనంగా మీనాక్షి నటరాజన్ వెళ్లిపోతుంటే పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టులా తయారవుతుందన్న ఆందోళన కాంగ్రెస్ నేతల్లో వ్యక్తమవుతుంది.

# తెలంగాణకు కొత్తగా మద్యం బ్రాండ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 ప్రపంచంలో కొన్ని వేల రకాల మద్యం బ్రాండ్లు ఉన్నాయి. కానీ, మందుబాబులు ఎక్కువగా తాగేది బీరే. కొంతమంది కొత్త వెరైటీలు టేస్ట్ చేస్తారు. తెలంగాణ రాష్ట్రంలోనూ కొన్ని మద్యం బ్రాండ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కొత్త బ్రాండ్లు, విదేశీ బ్రాండ్లు కావాలని చాలా మంది కోరుకుంటుంటారు. అయితే, వారి కోరిక ఫలించేలా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొత్త బ్రాండ్లకు అనుమతి ఇవ్వాలని డిసైడ్ అయింది.రాష్ట్రంలో త్వరలో నూతన మద్యం బ్రాండ్లు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఈ మేరకు గతంలో ప్రభుత్వం చేసిన కసరత్తు తర్వాత పెద్ద ఎత్తున విమర్శలు రాగా.. ఆ ప్రక్రియను తాత్కాలికంగా ప్రభుత్వం విరమించుకున్నది. అయితే, ప్రభుత్వం తాజాగా బడ్జెట్లో రాబడి అంచనాలను పెంచుకునేందుకు ఉన్న మార్గాలపై ఆరా తీయడంతో ఈ నిర్ణయం అమలు చేయనుందని తెలుస్తోందితెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 1,956 బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తే మరో 604 మద్యం బ్రాండ్లు రాష్ట్రంలోకి అడుగుపెట్టేందుకు ఎదురుచూస్తున్నాయి. వీటి అనుమతి కోసం సుమారు 92 కంపెనీలు ఉండగా.. ఇందులో బ్లెండర్స్ ప్రైడ్, రాయల్ ఛాలెంజ్, సులావైన్ వంటివి ఇక్కడ ఎక్కువగా అమ్ముడయ్యే బ్రాండ్లు ఉన్నాయి. కొత్తగా రాబోతున్న వాటిలో 15 విదేశీ బ్రాండ్లు, 15 దేశీయ లిక్కర్, 7 బీర్ బ్రాండ్లు, 37 కొత్త బ్రాండ్లు ఉన్నాయని తెలుస్తోంది.ఇటీవల ఎక్సైజ్ శాఖ అధికారులకు భారీగా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్డీపీఎల్) పట్టుబడింది. ఆ మద్యం సీసాల్లో లోకల్ బ్రాండ్లు లేకపోవడం, విదేశీ బ్రాండ్ మద్యం అక్రమ తరలింపు గుర్తించారు. ఈ ఎన్డీపీఎల్లో అత్యధికశాతం మన దగ్గర అందుబాటులో లేని జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు ఉంటున్నాయని ఎక్సైజ్ అధికారులు చెప్తున్నారు. ప్రభుత్వం దగ్గర పెండింగ్లో ఉన్న బ్రాండ్లకు అనుమతి లభిస్తే ఈ ఎన్డీపీఎల్ సమస్య తగ్గుతుందని కొందరు అధికారులు పేర్కొంటున్నారు.కొత్తవాటికి అనుమతిస్తే.. ఒక్కో బ్రాండు రూ.15 వేల చొప్పున అనుమతి ఫీజును వసూలు చేయనున్నారు. తద్వారా రూ.90,45,000లు ప్రభుత్వానికి రాబడి వస్తుంది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొన్ని వివాదాస్పద మద్యం కంపెనీలకు అనుమతులు ఇచ్చేందుకు సిద్ధమైంది. అప్పటికే సదరు కంపెనీల నేపథ్యం వివాదాస్పదంగా ఉండటం, కొన్నిచోట్ల అవి కల్తీ మద్యం విక్రయించాయని తేలడంతో ప్రభుత్వం వాటితో ఒప్పందాలు రద్దు చేసుకున్నది. ఈ క్రమంలో అప్రమత్తమైన ఎక్సైజ్శాఖ వివాదాస్పద కంపెనీలను పక్కనపెట్టిన విషయం తెలిసిందే.

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు అయిపోయాక.. కొత్త బ్రాండ్లకు గేట్లు తెరవాలని సర్కార్ ప్లాన్ చేస్తోంది. అంటే.. మార్చి లేదా ఏప్రిల్లో కొత్త మద్యం బ్రాండ్లు క్యూ కట్టే ఛాన్స్ ఉంది. ఇక అప్పుడు చూడాలి.. మందుబాబుల ఆనందం? మామూలుగా ఉండదు.

# ఒంగోలు నగర పాలక కౌన్సిల్ భేటి
## హాజరయి ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరిగింది.నగరపాలక సంస్థ ఎక్స్ ఆఫీషియో సభ్యులు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ తో పాటు అధికార టీడీపీ, మిత్రపక్షం జనసేన, ప్రతిపక్ష వైసిపి పార్టీకి చెందిన కార్పొరేటర్లు పాల్గొన్నారు.సమావేశానికి అవసరమైన కోరం సభ్యులు ఉండడంతో 130 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ నందు ప్రవేశ పెట్టారు.అజెండా లో ఒక అంశం మినహా అన్ని అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు.అజెండా లోని ప్రధాన అంశాలు అయిన ట్రంక్ రోడ్ విస్తరణ అంశం 3 తో పాటు మస్తాన్ దర్గా నుంచి కొత్తపట్నం బస్టాండ్ వరకు గల రోడ్డు విస్తరణ పనులకు సంబందించిన అంశం 107 లకు సభ ఆమోదం తెలిపింది.పలు అంశాలకు చెందిన విషయాలపైన వైసిపి కార్పొరేటర్ ఇమ్రాన్ ఖాన్ కు టీడీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.నక్ష కార్యక్రమంలో పేరుతో ఇంటింటికి నంబర్ల వేసే కార్యక్రమానికి 20 లక్షల పనికి 80 లక్షలు కేటాయించడం ఏమిటని వైసీపీ సభ్యులు తమ అభ్యంతరాన్ని లేవనెత్తగా టీడీపీ కార్పొరేటర్లు దీటుగా బదులిచ్చారు.రైల్వే అండర్ పాస్ పనులు జరుగుతున్న నేపథ్యంలో 16వ డివిజన్ ప్రజలకు త్రాగునీరు సరఫరా విషయంలో కొత్త ఇబ్బంది ఏర్పడుతుందని పార్టీలకు అతీతంగా త్రాగునీరు సరఫరా చేయాలని వైసీపీ కార్పొరేటర్ మాట్లాడాన్ని టీడీపీ కౌన్సిల్ సభ్యులు ఖండించారు.త్రాగునీటి సరఫరా విషయంలో పార్టీలు ఉండవు. అని ఆది ప్రజా అవసరం అన్న విషయాన్ని వైసీపీ సభ్యులు గుర్తుఎరుగాలని హెచ్చరించారు. పాత మార్కెట్ నందు పీపీపీ విధానంతో చేపట్టే అభివృద్ధి పనులను వాయిదా వేసారు.

## సోమాజిగూడ వైశ్యరాజ్ జువెలరీ షోరూమ్ ప్రారంభం

ప్రముఖ ఆభరణాల సంస్థ వైశ్యరాజు హైదరాబాద్ నగరంలో మొట్టమొదటి జువెలరీ షోరూంను అందుబాటులోకి తెచ్చింది. సోమాజిగూడ లో ఏర్పాటు చేసిన షోరూంను సినీనటి కాజల్ అగర్వాల్, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరి రాజు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ ప్రజల మన్ననలు అందుకున్న సంస్థ నగరంలో షోరూంను అందుబాటులోకి తేవడం సంతోషకరమని అన్నారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ ప్రజల మందనలో అందుకున్న తాము మొట్టమొదటిసారిగా 16వ బ్రాంచ్ ను నగరంలో ప్రారంభించినట్లు భద్రరాజు చెప్పారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను సైతం అందిస్తున్నామని తెలిపారు. అన్ని రకాల 22 క్యారెట్ బంగారు ఆభరణాలపై 6% తరువుకే ఆభరణాలు పొందవచ్చునని, వివిఎస్ క్లారిటీ, ఈ ఎఫ్ కలర్, ఐ జి ఐ సర్టిఫైడ్ డైమండ్ క్యారెట్స్ ఆభరణాలను 49,500 నుండి కొనుగోలు చేయవచ్చునని చెప్పారు. వెండి వస్తువుల పై ఎలాంటి తరుగు లేదని, వినియోగదారులపై జిఎస్టి భారాన్ని పడకుండా తామే భరిస్తున్నట్లు తెలిపారు. కేజీ వెండి వస్తువుల కొనుగోళ్లపై 15వేల వరకు ప్రత్యేకంగా తగ్గిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైశ్యరాజు ఫాల్గుణ రాజు, వైశ్యరాజు నరేష్ వైశ్యరాజు కిరణ్ కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న కలెక్టర్

మెదక్ జిల్లాలో ఉన్న నాలుగు మున్సిపాలిటీలు 148 పోలింగ్ కేంద్రాలలో ఉదయం ఏడు గంటలకు ప్రశాంతంగా పోలింగ్ ప్రారంభమైందని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా 18 వ వార్డులో ఆయన సతీమణితో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.. ఐదో వార్డులో అదనపు కలెక్టర్ నాగేష్, అదనపు ఎస్పీ మహేందర్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.. ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రతి ఒక్క ఓటరు పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.. ఈ సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో 686 మంది పోలీస్ సిబ్బంది తో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.. మెదక్ లో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సతీ సమేతంగా ఓటర్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు

# ట్రయాంగిల్ ఫైట్ లో గెలుపు ఎవరిది




హైదరాబాద్, ఫిబ్రవరి 11తెలంగాణ మున్సిపల్ ఎన్నికల క్లైమాక్స్ మొదలైంది. పార్టీలు జారీ చేసిన బీ-ఫారాలు ఒకరికి దక్కితే, ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన తమను విస్మరించారంటూ పలువురు నేతలు స్వతంత్రులుగా జెండా ఎగురవేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,700 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నప్పటికీ, ఇంకా 12,900 మందికి పైగా అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇందులో మెజారిటీ అభ్యర్థులు ప్రధాన పార్టీలకు చెందిన రెబల్స్ కావడం గమనార్హం. గెలుపు గుర్రాల కంటే, ప్రత్యర్థి గెలుపును అడ్డుకునే ఓట్ల చీలిక వ్యూహంతో వీరు ముందుకు వెళ్తుండటం పార్టీల గెలుపు అవకాశాలను దెబ్బతీసేలా ఉంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో రెబల్స్ సమస్య అత్యధికంగా కనిపిస్తోంది. ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో గెలుపు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని భావించిన ఆశావాహులు టికెట్ ఆశించారు. కానీ ఇటీవల ఇతర పార్టీల నుంచి చేరిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై పాత క్యాడర్ భగ్గుమంటోంది. ఉదాహరణకు జగిత్యాలలో సీనియర్ నేత జీవన్ రెడ్డి , ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య టికెట్ల కేటాయింపు వివాదం రచ్చకెక్కింది.

ఇలాంటి పరిస్థితులే మెదక్, గద్వాల వంటి చోట్ల కూడా కనిపిస్తున్నాయి. బీ-ఫారాల పంపిణీలో జరిగిన జాప్యం , సమన్వయ లోపం వల్ల కాంగ్రెస్లో రెబల్స్ సంఖ్య పెరిగిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి. పార్టీని నమ్ముకుని ఉన్న స్థానిక నేతలు, టికెట్ దక్కని పక్షంలో తమ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని భావించి బరిలోకి దిగారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా సొంత పార్టీ వారే భారీగా నామినేషన్లు వేశారు. కొందరు నేతలు ఇతర పార్టీల నుంచి వచ్చిన విమర్శలకు కౌంటర్ ఇవ్వడం కంటే, సొంత పార్టీ అభ్యర్థులనే టార్గెట్ చేయడం అధిష్టానాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. క్రమశిక్షణ చర్యల హెచ్చరికలు జారీ చేసినా చాలా మంది వెనక్కి తగ్గకపోవడం గమనార్హం.కేంద్రంలో అధికారంలో ఉండటం, రాష్ట్రంలోనూ పుంజుకుంటున్నామన్న ధీమాతో ఉన్న బీజేపీలోనూ రెబల్స్ బెడద తప్పలేదు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ పకడ్బందీగా అభ్యర్థులను ఎంపిక చేసినప్పటికీ, కొన్ని చోట్ల ఆర్ఎస్ఎస్ బ్యాక్గ్రౌండ్ ఉన్న వారికి కాకుండా కొత్తగా చేరిన వారికి టికెట్లు ఇచ్చారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు రెబల్స్ పై సీరియస్ అయ్యారు. నామినేషన్లు ఉపసంహరించుకోని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినప్పటికీ, నిజామాబాద్, అదిలాబాద్ వంటి ప్రాంతాల్లో బీజేపీ అభ్యర్థులకు రెబల్స్ గట్టి పోటీ ఇస్తున్నారు.ఈ రెబల్స్ ప్రభావం వల్ల బహుముఖ పోటీ నెలకొంది. విజేతను నిర్ణయించే మేజారిటీ ఓట్లు ఈ స్వతంత్రుల ఖాతాలోకి వెళ్లే ప్రమాదం ఉంది.

కేవలం 100 నుండి 500 ఓట్ల తేడాతో గెలుపోటములు నిర్ణయమయ్యే మున్సిపల్ వార్డుల్లో, ఈ రెబల్స్ చీల్చే 50 ఓట్లు కూడా ఫలితాన్ని తారుమారు చేస్తాయి. దీనివల్ల కొన్ని చోట్ల ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓడిపోయి, స్వతంత్రులు కింగ్ మేకర్లుగా లేదా విజేతలుగా అవతరించే అవకాశం ఉంది.

ఈ ఎన్నికలు ప్రధానంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, విపక్ష బీజేపీ మధ్య ముక్కోణపు పోటీని తలపిస్తున్నాయి. ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మొదటి మున్సిపోల్స్ కావడంతో, కాంగ్రెస్ దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రభుత్వ పథకాలు, ముఖ్యంగా ఆరు గ్యారెంటీలు తమను గెలిపిస్తాయని ఆ పార్టీ నమ్ముతోంది. మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకోవడం ద్వారా రాష్ట్రంపై తమ పట్టును నిరూపించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహరచన చేశారు.తమ పదేళ్ల అభివృద్ధి పనులే తమకు శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ భావిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ఎండగడుతూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో తమకు బలమైన క్యాడర్ ఉందని, అక్కడ మెరుగైన ఫలితాలు సాధిస్తామని గులాబీ దళం ఆశిస్తోంది.ఉత్తర తెలంగాణపై బీజేపీ గట్టి ఆశలు పెట్టుకుంది. పట్టణ ప్రాంత ఓటు బ్యాంకు సంప్రదాయబద్ధంగా తమకే మద్దతు ఇస్తుందని ఆ పార్టీ నమ్ముతోంది. నిజామాబాద్, కరీంనగర్ వంటి ప్రాంతాల్లో కాంగ్రెస్కు గట్టి పోటీ ఇచ్చేందుకు బీజేపీ సిద్ధమైంది.రాజకీయ విశ్లేషకుల అంచనాల ప్రకారం, ఈ ఎన్నికల్లో ప్రాంతాల వారీగా విభిన్నమైన ట్రెండ్ కనిపిస్తోంది. ఉత్తర తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు సాగనుంది. రామగుండం, నిజామాబాద్ వంటి కార్పొరేషన్లలో బీజేపీ సత్తా చాటాలని చూస్తోంది. ఇక దక్షిణ తెలంగాణలోని మహబూబ్ నగర్, నల్గొండ వంటి ప్రాంతాల్లో బీఆర్ఎస్ బలంగా ఉన్నప్పటికీ, అధికార బలం కాంగ్రెస్కు కలిసి వచ్చే అవకాశం ఉంది. మొదటి స్థానంలో నిలిచేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుండగా, ప్రధాన ప్రతిపక్షం తామే అని నిరూపించుకోవడానికి బీఆర్ఎస్, బీజేపీ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది.మొత్తం 2,996 వార్డుల్లో సుమారు 12,993 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ ఫలితాలు తెలంగాణ భవిష్యత్తు రాజకీయ దిశను నిర్దేశించనున్నాయి. ఓటర్లు తమ నగరాల, పట్టణాల అభివృద్ధి కోసం ఎవరికి పట్టం కడతారో వేచి చూడాలి.

# స్మార్ట్ డిజిటల్ లాజిస్టిక్ కేంద్రాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 తెలంగాణలో కొత్తగా 12 లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేసేందుకు రేవంత్ సర్కార్ ప్రణాళికలు రచిస్తోంది. రోడ్డు, రైలు, విమాన మార్గాలతో వీటిని కనెక్ట్ చేయనున్నారు. ఈ మేరకు సర్కార్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. కొన్ని ప్రాంతాల్లో డ్రై పోర్టులు, గిడ్డంగులుగా ఏర్పాటు చేసి స్మార్ట్ డిజిటల్ లాజిస్టిక్ కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నారు.తెలంగాణను అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు రేవంత్ సర్కార్ 'తెలంగాణ రైజింగ్ 2047' నినాదంతో ముందుకెళ్తోంది. అందులో భాగంగా.. రాష్ట్రాన్ని దేశంలోనే ప్రధాన లాజిస్టిక్ హబ్గా మార్చే దిశగా భారీ ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా.. తెలంగాణ లాజిస్టిక్ పాలసీ 2.0 సమగ్ర మాస్టర్ప్లాన్ రూపొందుతోంది. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యంతో.. రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రయత్నిస్తోంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 12 కొత్త లాజిస్టిక్ పార్కులు , అవసరమైన చోట్ల డ్రై పోర్టులు, అత్యాధునిక గిడ్డంగులను నిర్మించేందుకు రెడీ అవుతున్నారు.ప్రధానంగా పరిశ్రమలను ఆకర్షించడం, ఎగుమతులను ప్రోత్సహించడం, రవాణా ఖర్చులను తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. రోడ్డు, ట్రైన్, విమాన విమాన మార్గాలను కనెక్ట్ చేస్తూ ఒక పకడ్బందీ సరఫరా వ్యవస్థను నిర్మించనున్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమలకు, పారిశ్రామిక క్లస్టర్లకు, ఈ-కామర్స్ సంస్థలకు ఈ మాస్టర్ప్లాన్ బ్యాక్బోన్గా నిలవనుంది. పర్యావరణహిత విధానాలు, ఆటోమేషన్ ద్వారా లాజిస్టిక్ రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే మనోహరాబాద్ సమీపంలో మెగా మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే హైదరాబాద్ శివారులోని మంగళపల్లి, బాటసింగారం తరహాలో మరిన్ని పార్కులను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగు రోడ్డు మధ్య ఉన్న ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ' (ప్యూర్) జోన్గా ప్రభుత్వం గుర్తించింది. ఇక్కడ తయారీ యూనిట్లు, ఎంఎస్ఎంఈ క్లస్టర్లు, లాజిస్టిక్ హబ్లను ఏర్పాటు చేయటం ద్వారా గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థలను వేగంగా కనెక్ట్ చేయనున్నారు. దీనివల్ల భారీస్థాయిలో ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా.. సరుకు రవాణాకు అత్యంత అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. అలాగే, ఫ్యూచర్ సిటీ నుంచి బందరు పోర్టు వరకు ప్రతిపాదించిన 297 కిలోమీటర్ల గ్రీన్ఫీల్డ్ ఎక్స్ప్రెస్వే, రైల్వే లైన్, ఈ డ్రై పోర్టులను కనెక్ట్ చేస్తూ రాష్ట్ర ఎగుమతులను ప్రోత్సహించనున్నారు.

ఎయిర్ కార్గో రంగాన్ని కూడా మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే శంషాబాద్ విమానాశ్రయం ఔషధాలు, ఎలక్ట్రానిక్స్ వంటి విలువైన సరుకు రవాణాలో దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఉంది. ఈ ఎయిర్ కార్గో సేవలను రోడ్డు, రైలు మార్గాలతో సమన్వయం చేయడం ద్వారా 'మల్టీ-మోడల్ కనెక్టివిటీ'ని సాధించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ సమగ్ర లాజిస్టిక్ విధానం అమల్లోకి వస్తే.. తెలంగాణ పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా నిలవటం ఖాయం.

# పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

ఆసిఫాబాద్ పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె హరిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్లు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని న్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా జిల్లా యంత్రాంగం మరియు పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది అని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు.

ప్రతి పౌరుడు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి అని విజ్ఞప్తి చేశారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులకు వీల్ చైర్లు, వికలాంగులకు అవసరమైన సదుపాయాలు, తాగునీరు వంటి మౌలిక వసతులు అన్ని సమృద్ధిగా ఏర్పాటు చేసినట్లు ప్రస్తుతం జిల్లా కలెక్టర్ కె హరిత వెల్లడించారు.

## పోలింగ్ భద్రతను పర్యవేక్షించిన డీసీపీ

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని డీసీపీ భాస్కర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్లు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా జిల్లా యంత్రాంగం మరియు పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది అని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమైనదని పేర్కొన్న ఆయన, ప్రతి పౌరుడు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి అని విజ్ఞప్తి చేశారు.

# 12 ఫిబ్రవరి 2026 దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ




పరవాడ. మండలంలో పరవాడ ఫార్మాసిటీ లో ఈనెల 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని బుధవారం ఫార్మాసిటీ విజయ్ శ్రీ దగ్గర నుండిబైక్ ర్యాలీ ఐటీసీ మీదగా తానం చెక్పోస్ట్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కార్మికులకు నష్టం కలుగజేస్తున్న నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని జాతీయ కార్మిక సంఘాలు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని గని శెట్టి పిలుపునిచ్చారు. 2025 నవంబర్ 21 భారత కార్మిక వర్గానికి ఒక్క చీకటి దినం అన్నారు. ఆరోజు నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలని నినాదాలు చేస్తూ బైక్ యాత్ర కొనసాగించారు. అనంతరం ఐటీసీ దగ్గర జరిగిన సభా కార్యక్రమంకి సిఐటియు నాయకులు పి వెంకట్రావు అధ్యక్షత వహించగా ముఖ్య వక్త గా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల ధారబాబు, పి చిన్నారావు, ఏ రాజా, చిరంజీవి, ముత్యాలు, కృష్ణ, అప్పారావు, సత్తిబాబు, రాము, పైడ్రాజు, కన్నబాబు, నాగేష్, తదితర సంఘాల కార్మికులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటాం...

## రేవంత్ రెడ్డి సర్కార్ కు బ్రహ్మరథం.

## ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు.

కమాన్ పూర్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం ఉదయం కమాన్ పూర్ క్రాస్ రోడ్డు వద్ద ఆయన పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు బ్రహ్మరథం పట్టారని పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రామగుండం, కరీంనగర్, కార్పొరేషన్లను పూర్తిస్థాయిలో కాంగ్రెస్ కార్పొరేటర్ గెల్పొంది ఆయా రెండు పీఠాలను హస్తగతం చేసుకుంటామని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ మంథని పెద్దపల్లి అలాగే కరీంనగర్ జిల్లాలోని మొత్తం మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుంది అని అన్నారు. ముఖ్యంగా రేవంత్ రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. గతంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓటు వేశారని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ హవా కొనసాగుతోందని పేర్కొన్నారు. అన్ని స్థానాల్లో స్థానాల్లో భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన లో ప్రజలు ఆనందంగా ఉన్నారని అలాగే మా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో బలోపేతం అయిందని అన్నారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఉచిత బస్సు, ఉచిత విద్యుత్తు, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. నేడు తెలంగాణలోని ప్రతి ఒక్కరి కళ్ళలో కాంగ్రెస్ పాలనలో ఆనందం వెల్లివిరుస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, మాజీ సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, పేరా పల్లి సర్పంచ్ బొంగుని సదయ్య గౌడ్, గుండారం ఉపసర్పంచ్ అంబిరి రాజేందర్, వార్డు సభ్యులు పిడుగు సది, గరిగంటి కృష్ణ,బొడ్డు రవి, పిడుగు కవిత, రాచకొండ రజిత, మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు , ఆడువాలా చంద్రయ్య తోపాటు నాయకులు పిడుగు శంకర్, మతిన్ ఖాన్ ఇక్బాల్, లల్లు, వడ్లకొండ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# పొన్నెకల్లు లో భారీ చోరీ

తాడికొండ పొన్నెకల్లు లో 70 లక్షలు విలువ చేసే బంగారం, వెండి వస్తువులు చోరీ కి గురయ్యాయి. మెయిన్ డోర్లు పగుల కొట్టి కేసరి అశోక్ రెడ్డి ఇంట్లో దొంగలు చోరీ చేసారు. 400 గ్రాముల బంగారం, 2 కేజీల వెండి దోచుకున్నారు. బాధితుడు అశోక్ రెడ్డి వారం క్రితం ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్ వెళ్లాడు. మంగళవారం రాత్రి 2 గంటల సమయంలో ఇంటి వచ్చి చూడగా,తలుపులు తెరిచి ఉండటం గమనించాడు. రెండు బెడ్ రూమ్ లలో వస్తువులు మొత్తం చెల్లా, చెదురుగా ఉన్న వైనం. కబోర్డులోపల లాకర్ పగులకొట్టి బంగారం, వెండి వస్తువులు దోచుకున్న ట్లు గుర్తించారు.

# మున్సిపల్ ఎన్నికలు ప్రారంభం

## సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. భూపాలపల్లి ఖాసీంపల్లి 12, 13 మరియు కృష్ణ కాలనీలోని సింగరేణి స్కూల్లో ఉన్న నాలుగో వార్డ్ పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ గౌడ్ సందర్శించి పోలీసు బందోబస్తును పరిశీలించారు.
పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని, సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలతో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు.ఓటర్లు భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు.
శాంతియుత, పారదర్శక ఎన్నికల కోసం పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

# గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు నష్టం చేసే వి బి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలి



## ఎన్ఆర్ఈజీఎస్ పేరుతోనే పాత చట్టాన్ని కొనసాగించాలి

## భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిమాండ్

ఆళ్లగడ్డ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ స్థానంలో వి బి జి రామ్ జి చట్టాన్ని తెస్తూ చేసిన జీవోను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఆళ్లగడ్డ ఎంపీడీవో గారికి నిరసనతో కూడిన డిమాండ్స్ తో కూడిన మెమరాండము సమర్పించడం అయినది. ఈ సందర్భంగా సిపిఐ ఆళ్లగడ్డ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన వివిజి రాంజీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని కేంద్రమే 90 శాతం నిధులు భరించి పాత చట్టాన్ని అమలు చేయాలని 200 రోజులు పని దినాలు కల్పించి పని అడిగిన వెంటనే పని దినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, ఉపాధి కూలీలకు పని కల్పించలేని పక్షంలో సంవత్సరంలో 12 వేల రూపాయలు ఇవ్వాలని ఉపాధి కూలీలు పనిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని 10 డిమాండ్లతో కూడిన మెమరాండము ఆళ్లగడ్డ ఎంపీడీవో కి సమర్పించడం అయినది ఈ కార్యక్రమంలో ఇసుక పల్లె శాఖ కార్యదర్శి మధు ఆళ్లగడ్డ సి పి ఐ నాయకులు లక్ష్మీపతి రామంజి మధు పుల్లయ్య దాసరయ్య పాల్గొన్నారు.

# సింగరేణి పెన్షన్ సవరణకు కీలక అడుగు - పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



పెద్దపల్లి సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంపుదల కోసం చేస్తున్న ప్రయత్నాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి కీలక స్పంద న వచ్చిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ మీడి యాకు తెలిపారు. యాక్చురియల్ రిపోర్ట్ ఆధారం గా సింగరేణి పెన్షన్ సవరణ చేపట్టేందుకు కేంద్ర బొగ్గు గనుల శాఖ ముందడు గు వేసిందని, ఈ అంశంపై ఎంపీ వంశీకృష్ణ గత 6 న కేంద్ర బొగ్గు గనుల శాఖకు లేఖ రాసి, పెన్షన్ పెంపు, యాక్చురియల్ రీఅసెస్మెంట్ నిర్వహించాలని కోరారు. ఈ లేఖకు తాజాగా స్పందించిన కేంద్ర బొగ్గు గనుల శాఖ అండర్ సెక్రటరీ రూపిందర్ బ్రార్, గతేడాది డిసెంబర్ 22న సీఎంపీఎఫ్ఓ ట్రస్టీల సమావేశం నిర్వహిం చామని లేఖలో వెల్లడించారు. ఆ సమావేశం లో పెన్షన్ నిధి మూల్యాంకనంతో పాటు యాక్చురీని నియమించాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ యాక్చురీ పెన్షన్ పెంపు, నిధుల స్థితి, ఇతర కీలక అంశాలను సమగ్రంగా పరిశీ లించి నివేదిక అందించ నుందన్నా రు. ఆ యాక్చురీ రిపోర్ట్ ఆధారంగా సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ సవరణ చేపట్టనున్నారు. దీంతో సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ను రూ.10 వేల వరకు పెంచాలని శక్తివంచన లేకుం డా పోరాడుతున్నానని ఆయ న పేర్కొన్నారు. సింగరేణి రిటైర్డ్ కార్మికులకు మరోసారి మాట ఇస్తున్నానని మీ పెన్షన్ పెరిగే వరకు నా పోరాటం ఆగదని తెలిపారు. ఈ విషయంలో మీకు పూర్తి భరోసా ఇస్తున్నానని ఎంపీ గడ్డం వంశీ కృష్ణ స్పష్టం చేశారు.

# ఖమ్మంలో పోలింగ్ ప్రశాంతం

ఖమ్మం ఎదులాపురం మున్సిపాలిటీలోనీ జలగం నగర్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ దూరిశెట్టి అనుదిప్, రెవిన్యూ అధికారులు పరిశీలించారు. కలెక్టర్ మా?ట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. సమస్యత్మాక ప్రాంతాల్లో అదనపు బలగాలతో పర్యవేక్షస్తున్నాం. 11 గంటల వరకు 40 శాతం వరకు నమోదైంది. అత్యధికంగా ఎదులాపురం, కల్లూరు మున్సిపాలిటీలో పోలింగ్ శాతం ఎక్కువగా నమోదైంది. ఖమ్మం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలోనీ ప్రజలు అత్యధికంగా ఓటింగ్ లో పాల్గొని ఓటింగ్ శాతం పెంచాలని విజ్ఞప్తి చేశారు

# సమర్ధ వ్యూహంతో స్టార్టప్‌ల అభివృద్ధి సాధ్యం !

## డా. ఎన్.బి. హర్షవర్ధన్ రెడ్డి



తిరుపతి, ఫిబ్రవరి 11: సమర్ధవంతమైన వ్యూహాలు అవలంబిస్తే స్టార్టప్‌ల అభివృద్ధి సులభమని ప్రముఖ మేనేజ్‌మెంట్ శిక్షకుడు డా. ఎన్.బి. హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. కరకంబాడి రోడ్డులోని ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో ఎంబీఏ విద్యార్థులకు "ఎఫెక్టివ్ మార్కెటింగ్ స్ట్రాటజీస్ ఫర్ స్టార్టప్స్" అంశంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.స్టార్టప్ విజయానికి మంచి ఆలోచన మాత్రమే సరిపోదని, దాన్ని సరైన మార్కెటింగ్ మరియు సేల్స్ వ్యూహాల ద్వారా ప్రజలకు చేరవేయాల్సి ఉంటుందని తెలిపారు. పరిచయం లేకపోవడం, పరిమిత వనరులు స్టార్టప్‌లకు ప్రధాన సవాళ్లని పేర్కొంటూ, స్మార్ట్ వ్యూహాలు అవసరమని సూచించారు. వినియోగదారులను లోతుగా అర్థం చేసుకోవడం మార్కెటింగ్‌లో కీలకమని, ఉత్పత్తి ఎవరికోసం, వారి సమస్య ఏమిటి, అది ఎలా పరిష్కారం ఇస్తుందనే అంశాలపై స్పష్టత ఉండాలని చెప్పారు.మార్కెట్లో ఇప్పటికే ఉన్న ఉత్పత్తులతో పోలిస్తే ప్రత్యేకతను స్పష్టంగా వివరించగలిగితేనే వినియోగదారులు ఆకర్షితులవుతారని అన్నారు. స్టార్టప్‌లకు డిజిటల్ మార్కెటింగ్ శక్తివంతమైన సాధనమని పేర్కొంటూ, సోషల్ మీడియా, కంటెంట్ మార్కెటింగ్, ఎస్ఈఓ, ఇమెయిల్ క్యాంపెయిన్లు తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు ఇస్తాయని తెలిపారు. లీడ్ పొందడం నుంచి కస్టమర్‌గా మార్చే దశ వరకు ప్రతి ప్రక్రియను ట్రాక్ చేయాలని సూచించారు.డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటే వ్యూహాలు మరింత మెరుగవుతాయని, తప్పులను అంగీకరించి త్వరగా నేర్చుకునే సామర్థ్యం విజయానికి దారి తీస్తుందని చెప్పారు. మార్కెటింగ్‌ను ఖర్చుగా కాక పెట్టుబడిగా చూడాలని, సరైన వ్యూహంతో చేసిన మార్కెటింగ్ స్టార్టప్‌ను చిన్న ఆలోచన నుంచి పెద్ద బ్రాండ్‌గా మార్చగలదని పేర్కొన్నారు.ఐఐసి సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో సమన్వయకర్త డా. కాలేషా మస్తాన్ వలి, హెచ్ఓడి డా. ఎం. నీరజ, మిస్టర్ నాగరాజ నాయుడు, డా. టి. సిరీష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బైక్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి



మేడ్చల్ ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. . ఘట్కేసర్ పోలీసుల వివరాలు ప్రకారం ఎన్ ఎఫ్ సి నగర్ బ్రిడ్జి సమీపంలో హైదరాబాద్ వైపు నేషనల్ హైవే ల్ పై చెత్త ఏరుకుంటున్న ఒక గుర్తు తెలియని వ్యక్తి (50)ని అతివేగంతో బైకు ఢీకొట్టడంతో అతనికి తలకు ఇతర శరీర భాగాలపై గాయాలు అయ్యాయి. బాధితుడిని 108 వాహనంలో గాంధీ హాస్పిటల్ నకు తరలించి, ఓఒఅ జెనీ. 79408, చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. . బైకు ను వేగంగా నడిపిన రైడర్ నితిన్ పై పోలీసులు కేసు నమోదు చేసారు.

# చిన్నయ్య స్వామి చెంచుల

## ఆధార్ విషయంపై స్పందించిన ఎంపీడీవో భాగ్యలక్ష్మి.


రుద్రవరం మండలం కోటకొండ గ్రామపంచాయతీ చిన్నయ్య స్వామి చెంచుగూడెం లో 40 మందికి ఆధార్ కార్డు లేక ప్రభుత్వ పథకాలలో భాగంగా పౌల్ట్రీ ఫాం ద్వారా మేలు రకం జాతి కోళ్లను అందజేయాలని చెంచుగూడెంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మనోరంజన్ ప్రతాప్ సర్వే చేయగా ఆధార్ లేకఇబ్బందులు పడుతున్నారన్న వార్త గత5 రోజుల క్రితంపత్రికలలో వచ్చిన వార్తకు స్పందించిన రుద్రవరం ఎంపీడీవో భాగ్యలక్ష్మి మంగళవారం ఆమెఆధ్వర్యంలో చెంచుగూడెంలో ప్రత్యేక ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోటకొండ గ్రామ పంచాయతీ చిన్నయ్య స్వామి చెంచుగూడెంలో ఆధార్ కార్డు లేని వారికి, ఫోన్ నెంబర్ ఆధార్ కు లింకు కాని వారికి పిలిపించి ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేశామన్నారు. ఈ క్యాంపును గ్రామంలోని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు. ఈ ప్రత్యేక ఆధార్ కార్డు ఏర్పాటు చేసినందుకు చెంచు నాగమ్మ ఎంపీడీవోకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్రవరం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మనోరంజన్ ప్రతాప్, ఏ హెచ్ ఏ బాలు నాయక్,డిజిటల్ అసిస్టెంట్ మహేంద్ర నాయక్, మహిళా పోలీస్ త్రివేణి, ఏఎన్ఎం నాగేశ్వరమ్మ, అంగన్వాడీ టీచర్ రాజేశ్వరి, గ్రామస్తులు పాల్గొన్నారు.





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** జీహెచ్ఎంసీ ప్రత్యేక అధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ,ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ బుధవారంనాడు జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపిన కమిషనర్ ఆర్ వి కర్ణన్, ఉన్నతాధికారులు

# డమ్మీ క్యాండిడేట్లతో డిపాజిట్లకు గండి: సిరిసిల్లలో కాంగ్రెస్ పరువు తీసిన 'బడా' అగ్రిమెంట్లు!



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఫిబ్రవరి 11 (ప్రజాబలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని దెబ్బ తీశాయి. జిల్లా కేంద్రంలో బలమైన కేడర్ ఉన్నప్పటికీ, మెజారిటీ వార్డుల్లో డిపాజిట్లు గల్లంతు కావడం వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందనే అనుమానాలు ఇప్పుడు పట్టణమంతా గుప్పుమంటున్నాయి. కాంగ్రెస్ అగ్ర నేతలు అధికార పార్టీ (దీ=హ) నేతలతో కుమ్మక్కై, కావాలనే బలహీనమైన 'డమ్మీ' అభ్యర్థులను బరిలోకి దించారని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

ప్రజల చర్చల్లో వినిపిస్తున్న ప్రధాన ఆరోపణలు లోపాయికారీ ఒప్పందం సిరిసిల్లలో ప్రతిపక్షం బలంగా ఉంటే తమ గెలుపుకు అడ్డంకి అవుతుందని భావించిన కొందరు బడా నేతలు, కాంగ్రెస్ అగ్ర నాయకత్వంతో తెరవెనుక మంతనాలు జరిపారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే గెలిచే గుర్రాలను పక్కన పెట్టి, వార్డుల్లో పట్టులేని వారిని అభ్యర్థులుగా ప్రకటించారని విమర్శలు వస్తున్నాయి.నామమాత్రపు పోటీతోఎన్నికల ప్రచారంలో కూడా కాంగ్రెస్ అభ్యర్థులు ఎక్కడా సీరియస్‌గా కనిపించలేదు. ప్రచార ఖర్చులు, మేనేజ్‌మెంట్ అంతా ప్రత్యర్థి పార్టీ కనుసన్నల్లోనే సాగిందనేది స్థానిక కార్యకర్తల ఆవేదన.

తెరమరుగైన అస్తిత్వం: ఒకప్పుడు సిరిసిల్లలో ఓటు బ్యాంకు కలిగిన కాంగ్రెస్, ఈసారి కనీసం గౌరవప్రదమైన ఓట్లు కూడా సాధించలేకపోవడం వెనుక ఈ "డమ్మీ స్ట్రాటజీ" ప్రధాన కారణమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

కార్యకర్తల ఆగ్రహం:

తమ పార్టీ నాయకులే ప్రత్యర్థులతో చేతులు కలిపి పార్టీని తాకట్టు పెట్టారని క్షేత్రస్థాయి కార్యకర్తలు మండిపడుతున్నారు. "గెలిచే సత్తా ఉన్న నాయకులకు బి-ఫారాలు ఇవ్వకుండా, డమ్మీలను పెట్టడం ద్వారా డిపాజిట్లు గల్లంతు చేసుకున్నారు. ఇది ముమ్మాటికీ సొంత పార్టీ నేతలు చేసిన ద్రోహం" అని ఒక సీనియర్ కార్యకర్త ఆవేదన వ్యక్తం చేశారు.

సిరిసిల్ల మున్సిపల్ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి ఒక హెచ్చరిక. నాయకత్వంలో నిజాయితీ లేకపోతే, అభ్యర్థులు ఎంతమంది ఉన్నా డిపాజిట్లు దక్కవని ఈ ఎన్నికలు నిరూపించాయి.

# తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించిన ప్రతి ఓటర్ కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు

## రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 11 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** ఆందోల్ -జోగిపేట, మునిసిపల్ పరిధిలో, ప్రజాస్వామ్యంలో భాగంగా, తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించిన, ప్రతి ఓటర్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన మంత్రి, ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మీరు వేసిన ప్రతి ఓటు ఒక గుర్తుకే కాదు, మన పట్టణ భవిష్యత్తుకు వేసిన, నమ్మకము ముద్ర,అని ఆయన అన్నారు, మన పిల్లలకు రేపటికి ఇచ్చిన భరోసా, మన అభివృద్ధికి ఇచ్చిన ఆశీర్వాదం, ఎండను అలసటను లెక్కచేయకుండా, పోలింగ్ కేంద్రాలకు వెళ్లి, ఓటు వేసిన ప్రతి ఒక్కరికి, నా మనస్ఫూర్తి ధన్యవాదాలు మీలో కనిపించిన ప్రజాస్వామ్య స్ఫూర్తి, నాకు మరింత బాధ్యతను గుర్తు చేసిందని అన్నారు, రానున్న రోజుల్లో ఆందోల్- జోగిపేట ను శుభ్రంగా సురక్షితంగా, అభివృద్ధి పరంగా ముందుండే మునిసిపాలిటీగా, తీర్చి దిద్దడానికి, అహర్నిశలు కృషి చేస్తానని, ప్రతి ఇంటికి ఆరోగ్యం, ప్రతి కుటుంబానికి సంక్షేమం, ప్రతి యువకుడికి అవకాశం ఇదేనా సంకల్పం,మీరు చూపిన విశ్వాసం నా బలం, మీ ఆశలు నా బాధ్యత, మీ అభివృద్ధి నా ధ్యేయం, మనమంతా కలిసికట్టుగా ముందుకు సాగితే, అందోల్ -జోగిపేట, కథను కొత్త చరిత్రగా రాయగలం, ప్రతి ఓటర్కు మరొకసారి,నా హృదయపూర్వక నమస్కారాలు,?? మీ సేవలోదామోదర్ రాజనర్సింహ, తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మరియు శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి వర్యులు.

## 11 నిమిషాల్లో వెళ్లిపోయిన జగన్

విజయవాడ, ఫిబ్రవరి 11ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తున్నారు. మరోపక్క, శాసనసభకు వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి జగన్ చేరుకున్నారు. 'ప్రతిపక్ష హోదా ఇవ్వాలి' అనే ప్లకార్డులను, బ్యానర్లను పట్టుకుని వీరు అసెంబ్లీకి చేరుకున్నారు. వైసీపీ సభ్యులంతా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసుకుంటూ వచ్చారు. గేట్ నెంబర్ 4 నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసుకుంటూ వీరు సభలోకి వెళ్లారు. గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో ఆయన ప్రసంగానికి పదేపదే ఆటంకం కలిగిస్తూ వైసీపీ సభ్యులు నినాదాలు చేశారు. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ నినదించారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే, 11 నిమిషాల వ్యవధిలోనే గవర్నర్ ప్రసంగాన్ని బాయ్ కాట్ చేసి, సభ నుంచి బయటకు వెళ్లిపోయారు.

# డిజిటల్ అరెస్ట్' పేరుతో రూ.1.07 కోట్ల మోసం..

### ఢిల్లీ ముఠాను పట్టుకున్న హైదరాబాద్ పోలీసులు

### మోసానికి సహకరించిన ఢిల్లీకి చెందిన ముగ్గురు సభ్యుల అరెస్ట్

### ముంబై పోలీసులమంటూ బెదిరించి డబ్బులు కాజేసిన సైబర్ నేరగాళ్లు

### అమాయకుల బ్యాంకు ఖాతాలను వాడుకొని మోసాలకు పాల్పడుతున్న ముఠా

### అపరిచితులకు బ్యాంకు ఖాతాలు ఇవ్వొద్దని పోలీసుల హెచ్చరిక

డిజిటల్ అరెస్ట్ పేరుతో నగరానికి చెందిన ఒక వ్యక్తిని భయపెట్టి రూ.1.07 కోట్లు కాజేసిన సైబర్ మోసంలో కీలకపాత్ర పోషించిన ముగ్గురు సభ్యులను అరెస్ట్ చేసినట్లు హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ డీసీపీ వి. అరవింద్ బాబు తెలిపారు. నిందితులు ఢిల్లీకి చెందినవారని, వీరు మోసగాళ్లకు బ్యాంకు ఖాతాలను సరఫరా చేస్తూ ఈ నేరానికి సహకరించారని ఆయన వెల్లడించారు.ఇటీవల నగరానికి చెందిన బాధితుడికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు తాము ముంబై క్రైమ్ బ్రాంచ్ అధికారులమని పరిచయం చేసుకున్నారు. అతని ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌పై మనీ లాండరింగ్ కేసు నమోదైందని, వెంటనే అరెస్ట్ చేస్తామని బెదిరించారు. విచారణ పేరుతో "డిజిటల్ అరెస్ట్" చేసి, పలు దఫాలుగా రూ.1.07 కోట్లను వేర్వేరు బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేయించుకున్నారు.బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, డబ్బు బదిలీ అయిన ఖాతాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. మొదట దీపక్, ప్రశాంత్ కుమార్ అనే ఇద్దరు ఖాతాదారులను అరెస్ట్ చేశారు. వారిచ్చిన సమాచారంతో, ఈ మోసానికి బ్యాంకు ఖాతాలను సరఫరా చేస్తున్న ప్రధాన సూత్రధారులు గుర్దీప్ సింగ్, హర్‌ప్రీత్ సింగ్, కుమార్ మోహిత్‌లను ఢిల్లీలో అరెస్ట్ చేశారు. ఈ ముఠా ఢిల్లీ, జైపూర్ వంటి నగరాల్లోని హోటళ్లలో ఉంటూ, డబ్బు అవసరం ఉన్నవారికి కమిషన్ ఆశ చూపి వారి బ్యాంకు ఖాతాలను సేకరించి మోసాలకు వాడుతున్నట్లు తేలింది. వీరికి గుజరాత్, కేరళ, మహారాష్ట్ర వంటి ఇతర రాష్ట్రాల్లో జరిగిన సైబర్ నేరాలతోనూ సంబంధాలున్నట్లు పోలీసులు గుర్తించారు.ఈ సందర్భంగా డీసీపీ అరవింద్ బాబు మాట్లాడుతూ, "అపరిచితులకు కమిషన్ ఆశతో బ్యాంకు ఖాతాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీ, ఆధార్ వంటివి ఎవరితోనూ పంచుకోవద్దు" అని ప్రజలను హెచ్చరించారు.

## మందకృష్ణ మాదిగ 13 నా సభను జయప్రదం చేయండి, ఫిబ్రవరి 13వ తేదీన మందకృష్ణ మాదిగ రాక కరపత్రాలు విడుదల



దేవనకొండ కౌతాళం మండలం, హోల్వి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ శుక్రవారం విచ్చేయుచున్న సందర్భంగా కరపత్రాలును బుధవారం మండల కేంద్రమైన దేవనకొండ లో ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు సుభాష్ చంద్ర మాదిగ,యం ఆర్ పి ఎస్, దేవనకొండ మండలం ఇంచార్జ్ కె చిన్న సంజన్న మాదిగ, ఆదేశాల మేరకు కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం యం ఆర్ పి ఎస్ దేవనకొండ మండల అధ్యక్షులు మాచాపురం ఈరన్న మాదిగ, ఎం ఎస్ పి మండల అధ్యక్షుడు కోటకొండ పెద్దయ్యా మాదిగ మాట్లాడుతూ........భారత రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవలు మరువలేనివని వారు గుర్తు చేశారు. అదేవిధంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత మందా కృష్ణ మాదిగ తీసుకున్న తర్వాత కర్నూలు జిల్లాకు రావడం మొట్టమొదటిసారి అని మండలంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మరియు అనుబంధ సంఘాల, జిల్లా నాయకత్వం,మండలా నాయకత్వం, గ్రామస్థాయిలో ప్రతి గ్రామం నుండి అత్యధిక సంఖ్యలో పాల్గొనీ ఆయనకు మండల నలుమూలల నుండి వేలాదిగా తరలివచ్చి ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట నరసింహులు మాదిగ, పల్లె దొడ్డి కిష్టన్న మాదిగ, రంగస్వామి మాదిగ, రాజు మాదిగ, ఐస్వామి మాదిగ, శ్రీనివాసులు మాదిగ, గిడ్డయ్యా మాదిగ, బళ్లారి శీనన్న మాదిగ, దుబ్బన్న మాదిగ, పరమేష్ మాదిగ, తదితరులు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## మల్లన్న సాగర్ నీటి విడుదల పై సమీక్ష

### పాల్గొన్న ఎమ్మెల్యేలు హరీష్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి



సిద్దిపేట రంగనాయక సాగర్ ఇరిగేషన్ కార్యాలయంలో మల్లన్న సాగర్ నీటి విడుదల పై సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు హరీష్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సాగర్ నుండి నీటి విడుదల

ఇటీవల హరీష్ రావు, ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి నీళ్లు విడుదల చేయాలని రైతులు కలసి కోరారు. రైతుల ఆందోళన చెందుతున్నారని వేంటనే నీల్లు విడుదల చేయాలని అధికారులను హరీష్ రావు ఆదేశించారు. ఈ నేపధ్యంలో అధికారులు మల్లన్న సాగర్ నుండి ప్రధాన కాలువ కు నీళ్లు విడుదల చేసారు.

# బద్వేలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో సై అంటే సై

## ఒకపక్క బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మఆమె కుమారుడు టిడిపి సమన్వయకర్త రితీష్ రెడ్డి
## మరోపక్క డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి
## రెండు వర్గాలుగా విడిపోయిన బద్వేలు తెలుగుదేశం





బద్వేలు 25 సంవత్సరాల క్రితం వరకు బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోట. ఇదంతా మంత్రి వీరారెడ్డి బ్రతికి ఉన్నంత కాలం. వీరారెడ్డి 2020 డిసెంబర్ 25 చనిపోయారు. అప్పటికి ఆయన ఉమ్మడి రాష్ట్రంలో మూడుసార్లు మంత్రిగా పనిచేశారు. మంత్రిగా పనిచేస్తునే ఆయన చనిపోయారు. ఆయన ఏకైక కుమార్తె ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో తెలుగు దేశం అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఇదే తెలుగుదేశం పార్టీకి బద్వేల్ అసెంబ్లీలో చివరి గెలుపు. ఆ తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా విజయమ్మ కాంగ్రెస్ అభ్యర్థిగా గోవింద రెడ్డి పోటీ చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ శివరామకృష్ణ రావు విజయమ్మకు మద్దతు ఇచ్చిన ఉపయోగం లేకుండా పోయింది. . ఆ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఓడిపోయారు. ఆ తరువాత బద్వేల్ అసెంబ్లీ రిజర్వ్ అయింది. రిజర్వ్ అయిన తర్వాత తెలుగుదేశం పార్టీకి గెలుపు అనేది లేకుండా పోయింది. 2024 ఎన్నికల్లో బద్వేల్ అసెంబ్లీ బిజెపికి కేటాయించిన తెలుగుదేశం పూర్తి మద్దతుఇచ్చింది. అయినప్పటికీ బీజేపీ అభ్యర్థి ఓడిపోయారు. గడిచిన 25 సంవత్సరాలుగా బద్వేల్ అసెంబ్లీ కాంగ్రెస్ వైఎస్సార్సీపీకి కంచుకోటగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో గత కొన్ని నెలలుగా బద్వేలు అసెంబ్లీ తెలుగుదేశం పార్టీలో వర్గాలు బయలుదేరి సై అంటే సై అంటున్నాయి. వర్గాలు ముదిరి పాకాన పడ్డాయి. ఒక వర్గానికి డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రెండు వర్గాలు తమ మధ్య విభేదాలు లేవని పైకి చెబుతున్నారు. కానీ బద్వేలు తెలుగుదేశం పార్టీ ఎప్పుడో వర్గాలుగా విడిపోయింది. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ రితీష్ రెడ్డిలను వ్యతిరేకించే చాలామంది తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఇప్పుడు సూర్యనారాయణ రెడ్డి వెంట ఉన్నారు. వీరి మధ్య ఉన్న గ్రూపులు ఉమ్మడి కడప జిల్లాలోహాట్ టాపిక్ గా మారింది. రెండు వర్గాల మధ్య ఉన్న గ్రూపులు ఇప్పుడు ముదిరి పాకనపడ్డాయి.బద్వేలు నియోజకవర్గం లోని ఏడు మండలాల్లో తెలుగుదేశం పార్టీలో డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి దూసుకుపోతున్నారు. పార్టీలోని అందరిని ఆయన కలుపుకుపోతున్నారు. ఈ విషయం ఎవరు కూడా కాదనలేని సత్యం .గత కొంతకాలంగా బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో వైరి వర్గాలు కొనసాగుతున్నాయి. ఇది కూడా ఎవరు కాదనలేని నిజం. డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి గత 35 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. పార్టీ అభివృద్ధి కోసం ఆయన ఎంతగానో కష్టపడ్డారు. కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. నియోజకవర్గంలోని అట్లూరు మండలం వేములూరు ఆయన సొంత ఊరు. పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రస్తుత రాష్ట్రమంత్రి నారా లోకేష్ యువగలం పాదయాత్ర సమయంలో రితేస్ రెడ్డి పాదయాత్ర సమయంలో సూర్యనారాయణ రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఇది కూడా అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. సూర్యనారాయణ రెడ్డి కి జిల్లా స్థాయి డీసీసీబీ చైర్మన్ పదవి రావడంలో రావడంలో బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆమె కుమారుడు పార్టీ ఇంచార్జ్ రితేష్ రెడ్డి పాత్ర ఏమాత్రం లేదని ఆ పార్టీ లోని వారే గుసగుసలు పోతుంటారు. సూర్యనారాయణ రెడ్డి కి పార్టీ అధిష్టానం వద్ద ఉన్న పలుకుబడి రాష్ట్రంలోని కొందరు మంత్రులు ఉమ్మడి కడప జిల్లాలోని అధికార పార్టీ కూటమి ఎమ్మెల్యేలు మద్దతు ఇవ్వడంతో సూర్యనారాయణ రెడ్డికి డీసీసీబీ చైర్మన్ పదవి వచ్చిందని చెబుతుంటారు. కాగా తెలుగుదేశం పార్టీలో విజయమ్మ రితేష్ రెడ్డి లను వ్యతిరేకించే నాయకులు కార్యకర్తలు మెజార్టీ అభిమానులు ఇప్పుడు సూర్యనారాయణ రెడ్డికి పూర్తిగా మద్దతు ఇస్తున్నారు. బద్వేల్ నియోజకవర్గం దేశం పార్టీ ఇంచార్జ్ విషయంలో అధిష్టానం జరిపిన సర్వేలో సూర్యనారాయణ రెడ్డికి దాదాపు 80 శాతం మంది మెజార్టీ రావడంతో తెలుగుదేశం పార్టీలో గత కొన్ని నెలలుగా వర్గాలు ఏర్పడ్డాయి. పాతిక సంవత్సరాల క్రితం వరకు బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకో.ట ఆ తర్వాత జరిగిన ఐదు అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలవలేకపోయింది.

బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ లో వర్గపోరు బట్టబయలైంది. బద్వేలు నియోజకవర్గం మాజీ మంత్రి బిజీవేముల వీరారెడ్డి కాలంలో తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉంది.ఆయన మరణాంతరము రవాణాశాఖలో ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ గా పని చేస్తున్న గోవింద రెడ్డి రాజకీయారంగేట్రం చేయడంతో కంచుకోటలాగా ఉన్న బద్వేలు నియోజకవర్గం బద్దలైంది. అప్పటినుండి వైఎస్సార్సీపీ విజయాలకు తిరుగులేకుండా పోయింది. అయితే ఎలాగైనా బద్వేలు తెలుగుదేశం పార్టీలో పాగా వేయాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ తన వారసునిగా రితీష్ రెడ్డి ద్వారా చేస్తున్న ప్రయత్నాల కు వర్గపోరు తారాస్థాయికి చేరింది. రితీష్ రెడ్డి వర్గం, రైల్వే కాంట్రాక్టర్ అయిన ప్రస్తుత డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి ని తెరపైకి ఒకవర్గం తీసుకొచ్చింది. లోలోపల రగులుతున్న వర్గపోరు గత నెల 23 వ తేదీన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు చేసే ఏర్పాట్లలో బట్టబయలైంది. బద్వేలు నియోజకవర్గాన్ని శాశించే పోరుమామిళ్ల పట్టణంలో నారా లోకేష్ జన్మదిన వేడుకలను భారీగా ఏర్పాట్లు చేసేందుకు డీసీసీబీ చైర్మన్ సూర్య నారాయణరెడ్డి వర్గానికి చెందిన చెరుకూరి రవికుమార్ నేతృత్వం లో, ప్రహల్లాదరెడ్డి, లు భారీ ఏర్పాట్లు చేశారు అయితే రితీష్ రెడ్డి వర్గానికి చెందిన బద్వేలు మార్కెట్ యార్డ్ కమిటీ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి, పోరుమామిళ్ల సింగిల్ విండో ఛైర్మెన్ కల్లూరు కృష్ణారెడ్డి, కాశినాయన మండల తెలుగు యువత అధ్యక్షుడు పంగా రవీంద్రారెడ్డి, ఇమాంహుస్సేన్, రామసుబ్బారావు, ఎంపిటిసి కలవకూరి రమణ,మురుకూటి విజయకుమార్ రెడ్డిలు మరో వైపు భారీ ఏర్పాటు చేశారు ఇది కాస్త అప్పట్లో వివాదస్పదమైంది పోటాపోటీగా ఫ్లెక్సీ లులోకేష్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని రెండు వర్గాలు పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు ఈ ఫ్లెక్సీలలో ఫొటోలు ఇవ్వాలని రెండు వర్గాలు కార్యకర్తలను ఒత్తిడి చేస్తుండటంతో ఎవరికి ఫొటోలు ఇస్తే ఎవరు ఏ ఇబ్బందులు పెడతారో ఇవ్వాలా,వద్దా అనే మీ మాంసలో పడిపోయి వారిని చూస్తే దాక్కునే స్థాయిలోకి వెళ్లారు. బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో తెలుగు తమ్ముళ్ల మధ్య ఆధిపత్య పోరులో రాజకీయ సెగలు అంటుకున్నాయి. బద్వేలు టిడిపి ఇంచార్జి రితీష్ రెడ్డి వైపున్న నాయకులు, కార్యకర్తలు, దూరం కావడంతో దానిని ఆసరాగా తీసుకున్న డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి. బద్వేల్ టిడిపి ఇన్చార్జి గా బాధ్యత లు తీసుకొని బద్వేల్ నియోజక వర్గంలోని గ్రామీణ ప్రాంతాల సైతం ప్రజలు,నాయకులు, కార్యకర్తలతో పరిచయాలు పెంచుకొని తెలుగు దేశం పార్టీని బలోపేతం చేస్తానని అధిష్టానంలో ముమ్మరంగా పావులు కదుపుతున్నారు. దీంతో సూర్యనారాయణరెడ్డి, రితీష్ రెడ్డి ఇంచార్జి పదవికి పొగబెట్టే పని లో నిమగ్నమయ్యారనడంలో సందేహం లేదు. తెలుగు తమ్ముళ్ల ను కూడగట్టుకుని బద్వేల్ నియోజకవర్గానికి ఇన్చార్జి గా పార్టీ పగ్గాలు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బద్వేలు ప్రాంతంలో కాకుండా పోరుమామిళ్ల, కాశినాయన,కలసపాడు, బి కోడూరు అట్లూరు బద్వేలు గోపవరం. మండలాల్లోని కొంతమంది తెలుగుదేశం పార్టీ ముఖ్యనేతలు డీసీసీబీ చైర్మన్ కు మద్దతు తెలుపుతున్నారు. పోరుమామిళ్ల ప్రాంతంలో నాయకులు కార్య కర్తలతో కలుసుకొని తమ రాజకీయ బలాన్ని నిరూపించుకోవాలని ఉద్దేశంతో గత నెల 23వ తేదీన రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను పోరుమామిళ్ల ప్రాంతంలో భారీగా జరిపారు ఇప్పుడు బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు వర్గ స్థాయికి చేరాయిని చెప్పాలి

## హుస్నాబాద్ లో కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి పొన్నం



హుస్నాబాద్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థ లో ఓటు అనేది ఆయుధం. ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతం ఓటర్లు ఓటు వేస్తున్నారు అర్బన్ ప్రాంతాల్లో అవగాహన తక్కువ ఉంది. 116 మున్సిపాలిటీ లు ,7 కార్పొరేషన్ లలో ప్రతి అర్బన్ ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్న. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులను ఏ విధంగా ఎన్నుకుంటున్నారో అర్బన్ ప్రాంతాల అభివృద్ధికి పట్టణ ఓటర్లు తమ విచక్షణ తో ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడి ప్రజా ప్రతినిధి నీ ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేస్తున్న. ఓటు వేయకుంటే గ్రామీణ ప్రాంతాల్లో జీవించి ఉన్నట్లు కాదని నానుడి చెప్తారు. అర్బన్ లో అనేక పనులు ఉన్నప్పటికీ వెసులుబాటు చేసుకొని తమ ఓటు వినియోగించుకోవాలి అర్బన్ ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగించుకోండి ఇది ప్రజాస్వామ్యానికి నిదర్శనమని అన్నారు.

## కూటమి నాయకులు నీచ రాజకీయాలను మానుకోవాలి



తుగ్గలి: : తిరుమల లడ్డు తయారీలో వినియోగించే నెయ్యిలో ఎలాంటి జంతువుల కొవ్వు కలపలేదని సిట్ తేల్చిన నేపథ్యంలో కూటమి నాయకులు నీచ రాజకీయాలను మానుకోవాలని వైఎస్ఆర్సీపి నేతలు హితవు పలికారు. బుధవారం మండల కేంద్రమైన తుగ్గలిలో వైయస్సార్సీపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి,గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రారెడ్డి, ఎస్టీ సెల్ జోనల్ అధ్యక్షులు నారాయణ నాయక్,పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నాగేష్ యాదవ్,మేధావుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి రాతన మోహన్ రెడ్డి, ఆర్.టి.ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణ రెడ్డి,పార్టీ మండల అధ్యక్షుడు అట్లా గోపాల్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ వైస్సార్సీపీ హయాంలో లడ్డు ప్రసాదానికి వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగిందంటూ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు.సుప్రీం కోర్టు సిట్ తమ ఛార్జ్ సిట్ లో నెయ్యిలో ఎటువంటి కల్తీ జరగలేదని పేర్కొనడంతో కూటమి నాయకులు ఖంగుతిన్నారన్నారు.ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని అబద్ధాలు ప్రచారం చేశారని తెలిపారు.కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డు ఎంతో పవిత్రమైనప్పటికీ ఎటువంటి ఆధారాలు లేకుండా నెయ్యిలో కల్తీ జరిగిందంటూ ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు.మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని అప్రతిష్ట పాలు చేసేందుకు లడ్డు కల్తీ జరిగిందంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.సీఎం స్థాయిలో ఉండే వ్యక్తి నిరాహార ఆరోపణలు చేస్తుంటే సాక్షాత్తు సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని సిబిఐ విచారణకు ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు.వాస్తవాలను తెలుసుకొని విమర్శలు చేయాలని వారు కూటమి నాయకుల పై మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోహన్ రెడ్డి,నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ చాంద్ భాష,మామిళ్ళకుంట సత్యప్ప, ముక్కెళ్ల గోవర్ధన్ రెడ్డి,బొందిమడుగుల ఈశ్వర్ రెడ్డి,రామకొండ సుధాకర్ రెడ్డి, మారెళ్ళ సుధాకర్ రెడ్డి,మాజీ సర్పంచ్ దేవరాజు,అమీనాబాద్ రామాంజనేయులు,విష్ణువర్ధన్ రెడ్డి, సంఘాల సురేష్ తదితర వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజయమ్మకు నివాళులర్పించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి.



వనపర్తి. ఖిల్ల ఘణపురం మండల కేంద్రానికి చెందిన తన పెదనాన్న కుమారుడు భాస్కర్ రెడ్డిసతీమణి విజయమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది.విషయం తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి విజయమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.తనకున్న ఇద్దరు కొడుకులు తల్లి లేని పిల్లలుగా అయిపోయారని ఆవేదన వ్యక్తం చేసిన భాస్కర్ రెడ్డిని ఓదారుస్తూ తన కుటుంబానికి ఎల్లవేళల తను అండగా ఉంటానని ఎమ్మెల్యే వారికి ధైర్యం చెప్పారు.కార్యక్రమంలో గంజాయి రమేష్ నాయకుడు లక్ష్మారెడ్డి ఆగారం ప్రకాష్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపద్మావతీ చిన్నపిల్లల ఆసుపత్రి నూతన భవనాన్నిపరిశీలించిన టిటిడి జేఈవో (వైద్యం & విద్య) డా. ఎ. శరత్

తిరుపతి, 2026, ఫిబ్రవరి 11. తిరుపతిలో నిర్మాణంలో ఉన్న శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి నూతన భవనాన్ని టిటిడి జేఈవో (వైద్యం & విద్య) డా. ఎ. శరత్ పరిశీలించారు. టిటిడి సాంకేతిక సలహాదారు శ్రీ ఆర్. కొండల రావుతో కలిసి నిర్మాణంలోని భవనాన్ని బుధవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జేఈవో డా. శరత్ మాట్లాడుతూ, చిల్డ్రన్స్ ఆసుపత్రి నూతన భవనాన్ని నిర్దిష్ట సమయాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా జరుగుతుండడంపై ఆయన సంబంధించిన అధికారులను ప్రశ్నించారు. టిటిడి ఇంజనీరింగ్ టెక్నికల్ అడ్వైజర్ సూచనల మేరకు పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు చుట్టూ పచ్చదనం, ఆసుపత్రి లోపల దైవభక్తి, మనోధైర్యం నింపేలా దేవతామూర్తుల ఫోటోలను, నిత్యం పర్యవేక్షించేలా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రి భవనానికి అవసరమైన ఎలక్ట్రికల్ తదితర మౌళిక సదుపాయాల పరికరాల ఎంపికలో మరింత నాణ్యమైన వస్తువులను ఉపయోగించాలని కోరారు. నూతన భవనానికి సంబంధించి జరుగుతున్న పనులపై ఆసుపత్రి ముందు శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిఈ శ్రీ టి.వి. సత్యనారాయణ, ఆసుపత్రి డైరెక్టర్ డా. ఎన్. శ్రీనాథ్ రెడ్డి, ఆర్ ఎంవో డాక్టర్ భరత్, ఎస్.ఈలు వేంకటేశ్వర్లు, మనోహరం తదితర అధికారులు పాల్గొన్నారు.

# మంచిర్యాల జిల్లాలో ప్రశాంతంగా కొనసాగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ

## జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 11 :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా జిల్లాలోని 1 మున్సిపల్ కార్పొరేషన్,4 మున్సిపాలిటీలలో నిర్వహించిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగిందని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా మున్సిపాలిటీలలో కొనసాగుతున్న ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు.అనంతరం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల,జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల,క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని రామకృష్ణాపూర్ ప్రాంతంలో గల అల్ఫోన్జా ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టడం జరిగిందని,ఈ క్రమంలో అర్హులైన ఓటర్లు నిర్ణీత సమయంలోగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా బూత్ స్థాయి ఏజెంట్లు కృషి చేయాలని సూచించారు. సాయంత్రం 5 గంటల లోపు పోలింగ్ కేంద్రం గేటు మూసివేసి,లోపల ఉన్నవారికి ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లో 60 డివిజన్లకు గాను 265 పోలింగ్ కేంద్రాలు, బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులకు గాను 68 పోలింగ్ కేంద్రాలు,చెన్నూర్ మున్సిపాలిటీలో 18 వార్డులకు గాను 36 పోలింగ్ కేంద్రాలు, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 వార్డులకు 45 పోలింగ్ కేంద్రాలు, లక్షెట్టిపేట మున్సిపాలిటీలో 15 వార్డులకు గాను 30 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన సర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.ఎన్నికల నిర్వహణ కొరకు జోనల్,నోడల్ అధికారులు, పి.ఓ.లు,ఎ.పి.ఓ.లు,ఓ.పి.ఓ.లు,వీడియో, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ,మీడియా సెల్,ఇతర ఎన్నికల సంబంధిత సిబ్బందిని నియమించి, అధికారులు,సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 మంది ఓటర్లకు మించకుండా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు అవసరమైన త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు.పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో ఓటు వేసిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 11 :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 52వ డివిజన్ లోని కార్పొరేటర్ ఎన్నికల సందర్భంగా హైటెక్ సిటీ క్లబ్ పోలింగ్ కేంద్రంలో మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన హక్కు ప్రతి పౌరుడు తన ఓటును బాధ్యతగా,ఆలోచనతో వినియోగించుకోవాలి.ప్రజాస్వామ్య బలోపేతానికి అందరం కలిసి ముందుకు సాగుదాం అన్నారు.వారితోపాటు వారి కుటుంబ సభ్యులు మంచిర్యాల ఎమ్మెల్యే అమ్మ కొక్కిరాల కమలమ్మ,మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ దేవాపూర్ అదాని








సిమెంట్ కంపెనీ యూనియన్ అధ్యక్షుడు కొక్కిరాల సత్య పాల్ రావు,మంచిర్యాల ఎమ్మెల్యే తనయుడు కొక్కిరాల చరణ్ రావు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# బ్యాలెట్ పేపర్ స్టేటస్ బెల్లంపల్లి కలకలం




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 11 :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపల్ ఎన్నికల్లో ఓమాజీ కౌన్సిలర్ ఓటు వేసి బ్యాలెట్ పేపర్ ను స్టేటస్ లో పెట్టుకున్న సంఘటన వెలుగు చూసింది.బెల్లంపల్లి పట్టణంలోని బెల్లంపల్లి బస్తిలోని 19 వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కొమ్ముల జయ,తనయుడు మాజీ కౌన్సిలర్ కొమ్ముల సురేష్ 32 పోలింగ్ బూత్ లో ఓటు ఓటు వేశారు.ఓటు వేసిన బ్యాలెట్ పేపర్ ను ఫోటో తీసుకొని స్టేటస్ పెట్టుకున్న సంఘటన చర్చనీయాంశంగా మారింది.


ఓటు వేసిన బ్యాలెట్ పేపర్ స్టేటస్ తెర పైకి రావడంతో ఎన్నికల అధికారులు ఒక్క సారిగా ఖంగుతిన్నారు.పోలింగ్ బూత్ లోకి ఆయన సెల్ఫోన్తో ఎలా వెళ్లడానీ చర్చ జరుగుతుంది.పోలింగ్ బూత్ అధికారులు,పోలీసుల తనిఖీల వైఫల్యం వల్లనే ఈ సంఘటన చోటుచేసుకుందని తెలుస్తోంది.ఈ ఘటనపై ఎన్నికల ఉన్నతాధికారులు, పోలీసులు విచారణ చేపట్టారు. అత్యుత్సాహంతో ఓ మాజీ కౌన్సిలర్ కొమ్ముల సురేష్ నిర్వాకంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఓటు వేసిన బ్యాలెట్ పేపరు స్టేటస్ తో బయటికి రావడం,ఎన్నికల అధికారులు,విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందనే చర్చ ఆసక్తికరంగా మారింది.

# వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోతెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సతీమణి కీ.శే గడ్డం శైలజమ్మ జయంతి



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఫిబ్రవరి 11 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** వికారాబాద్ క్యాంపు కార్యాలయంలో వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సతీమణి గడ్డం శైలజమ్మ జయంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ వారికి ఘన నివాళు లు అర్పించిన ఓహెచ్డీ వెంకట్ , మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సన్నగారి కొండల్ రెడ్డి, సుభాష్ యాదవ్, మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్, పట్లూర్ సర్పంచ్ పరుశు రాం , మాజీ ఎంపిటిసి సురేష్,రాచన్న ,మహేష్ ,వెంకట్ , వాడు మెంబర్ నందు ప్రకాష్,

గడ్డం శైలజమ్మ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి జోహార్లు చెప్పారు,గడ్డం



ప్రసాద్ కుమార్ జీవిత భాగస్వామిగా ఉండి ఆయనకు వెన్నుదండుగా ఉండి కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను సొంత కుటుంబ సభ్యులుగా చుసుకున్న వ్యక్తిగా చిరస్మరణీయంగా కాంగ్రెస్ పార్టీ నాయకుల కార్యకర్తల్లో చెరగని ముద్ర వేసిన మహాత్మురాలని పేర్కొన్నారు

# సున్నిత పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్‌కాస్టింగ్ -- పారదర్శకంగా మున్సిపల్ ఎన్నికలు



**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఫిబ్రవరి 11:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటింగ్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విస్తృత ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఇందులో భాగంగా మున్సిపాలిటి పరిధిలోని అత్యంత సమస్యాత్మక మరియు సున్నితమైన పోలింగ్ కేంద్రాలలో లైవ్ వెబ్‌కాస్టింగ్ (ాఅజవ ఔవఎఝర్అఅస్త్ర) సదుపాయాన్ని ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో నిరంతర సూక్ష్మ పరిశీలించి పర్యవేక్షించడం జరిగిందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు.

## మహాదేవప్ప కుటుంబానని పరామర్శించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



నారాయణపేట ఇటీవల కాంగ్రెస్ పార్టీ వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న మక్తల్ 6వ వార్డు బిజెపి గిరిజన అభ్యర్థి ఎరుకల మహాదేవప్ప గారి నివాసానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్వయంగా వెళ్లి, పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు.

ఈ కష్టకాలంలో బాధిత కుటుంబానికి భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని, ఆ కుటుంబానికి ఏ కష్టమొచ్చినా పార్టీ సొంత మనిషిలా తోడుగా నిలబడుతుందని కిషన్ రెడ్డి వారికి భరోసా కల్పించారు. రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు బిజెపి తెలంగాణ శాఖ తరఫున ప్రకటించిన రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని స్వయంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ ఎంపీ తి డికె అరుణ, స్థానిక బిజెపి నాయకులతో కలిసి మహాదేవప్ప కుటుంబానికి అందజేశారు.

## మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాల తనిఖీ

## అధికారులకు కలెక్టర్ సూచనలు









**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఫిబ్రవరి 11:**మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్ ల సాధారణ ఎన్నికల 2026లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీ లలోని పోలింగ్ బూతులలో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను ను సాధారణ ఎన్నికల పరిశీలకులు నిర్మల కాంతి వెస్లీ తో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు.

బుధవారం ఉదయం మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఆలియాబాదులోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో, మూడుచింతలపల్లి లోని జగ్గన్ గూడ లో గల జిల్లా పరిషత్ హై స్కూల్ లో, ఎల్లంపేట్ మున్సిపాలిటిలోని రాజబొల్లారంలో గల ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ లలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూతులలో నిర్వహిస్తున్న ఓటింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్, అబ్జర్వర్ లు తనిఖీ చేసారు. బూతులలో పోలింగ్ విధానాన్ని పరిశీలించి ఇప్పటివరకు ఎంత మంది ఓటు వేసారని ప్రిసైడింగ్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు. పొలింగ్ బూతులలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసారా అని, వీల్ ఛైర్, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఓటు వేయడానికి వీల్ ఛైర్ లో వచ్చిన వృద్దురాలితో మీ పేరు ఏమిటి, ఎంత వయసు అని కలెక్టర్ అడుగగా, తన పేరు కిష్టమ్మ, తన వయసు 65 సంవత్సరాలని ఓటు వేయడానికి వచ్చానని ఆనందంగా తెలియజేసింది.

## వేములవాడలో ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు.

## అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సులలో నిక్షిప్తం.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** వేములవాడలో బుధవారం రోజు నిర్వహించిన మున్సిపల్ ఎన్నికలు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5:00 వరకు జరిగిన ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం జరిగింది. వేములవాడ మున్సిపల్ పరిధిలో సాయంత్రం 5 గంటల వరకు 77.80 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలో మొత్తం ఓటర్ల సంఖ్య 40,877 కాగా ఇందులో 14,742 మంది పురుషులు,17,055 మంది స్త్రీలు, ఇతరులు 06 (ఆరుగురు) ఓట్లు వేసినారు. మొత్తం 31,803 మంది తమ తమ ఓట్లను వినియోగించుకున్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలో పురుషుల కంటే మహిళలే అధికంగా ఓటింగ్ లో పాల్గొన్నారు. పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య వేములవాడ పట్టణంలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగినాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు.
ఎన్నికలు ముగియడంతో అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సులలో నిక్షిప్తమై ఉన్నాయి. ఎవరి గెలుపు, ఎవరి ఓటమి, ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయి అనే విషయం తెలియాలంటే 13 వ తారీకు శుక్రవారం వరకు వేచి ఉండవలసిన అవసరం ఉంది.

## ఏపీ గవర్నర్ ను కలిసిన ఓరియంట్ సిమెంట్ లిమిటెడ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వై శ్రీనివాసరావు



విజయవాడ ఫిబ్రవరి 11 విజయవాడలోని రాజ్ భవన్‌లో ఓరియంట్ సిమెంట్ లిమిటెడ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వై శ్రీనివాసరావు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. గతంలో అబ్దుల్ నజీర్‌భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు మరియు అయోధ్య టైటిల్ కేసు, ట్రిపుల్ తలాక్ మరియు కీలకమైన పౌర స్వేచ్ఛా విషయాలతో సహా మైలురాయి తీర్పులు ఇచ్చిన బెంచ్‌లో భాగంగా ఉన్నారని ఆయనను కలిసే అవకాశం లభించడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు శ్రీనివాస్ రావు.

## భక్తులకు సులభంగా దర్శనం కల్పించేలా ఏర్పాట్లు.

### ఇన్చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్. మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గీతే.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** మహాశివరాత్రి జాతర సందర్భంగా వేములవాడలో శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు సులభంగా దర్శనం కల్పించేలా ఏర్పాటు చేస్తున్నామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్ తెలిపారు.
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధం ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను బుధవారం ఇంచార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే, వేములవాడ ఏ ఎస్ పి రిత్విక్ సాయి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లు, భక్తుల ఎంట్రీ బిఎగ్జిట్ మార్గాలు, పార్కింగ్ సదుపాయాలు తదితర అంశాలను పరిశీలించి, జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులకు సూచించారు.
వీఐపీ దర్శనాల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.
ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, వేములవాడ ఆర్డిఓ రాజాబాయి, ఈ ఈ రాజేష్, ఆర్ అండ్ బి ఈ ఈ నరసింహ చారి, డి ఈ శాంతయ్య, వేములవాడ అర్బన్ తాసిల్దార్ జయంతి కుమార్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, టిపిఓ అన్సార్, ఆలయ ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలో మహాశివరాత్రి జాతరకు ఘనంగా ఏర్పాట్లు.

## భక్తులకు సకల సౌకర్యాలు.





**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో త్వరలో జరిగే మహాశివరాత్రి జాతరకు ఏర్పాట్లను ఘనంగా చేపడుతున్నారు.
మహాశివరాత్రి జాతర సందర్భంగా ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఆలయ అధికారులు విస్తృత స్థాయిలో ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ పార్కింగ్ ప్రదేశంలో ప్రత్యేకంగా విద్యుత్ దీపాల అలంకరణలు, బారి గేట్లు, వాహనాలను సక్రమంగా నిలిపేందుకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. అలాగే శివార్చన కార్యక్రమాల కోసం ప్రత్యేక వేదిక (స్టేజ్) ఏర్పాటు చేశారు.
భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చలువ పందిళ్లు, త్రాగునీటి సదుపాయం, స్వామిబిఅమ్మవార్ల రంగు రంగుల విద్యుత్ దీపాల అలంకరణలు ఏర్పాటు చేస్తున్నారు. అదనంగా సానిటేషన్ చర్యలు, పారిశుద్ధ్య పనులు, తాత్కాలిక మరుగుదొడ్లు (టాయిలెట్స్), సీసీ రోడ్ల సౌకర్యం వంటి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.
శివరాత్రి సందర్భంగా వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విభాగాలతో సమన్వయం చేస్తూ ఆలయ అధికారులు సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

## ప్రభుత్వ న్యాయవాదులకు గుడ్ న్యూస్



హైద్రాబాద్ ఫిబ్రవరి - 11 కేంద్రప్రభుత్వం తరపున వివిధ కోర్టుల్లో వాదించే న్యాయవాదుల ఫీజులను కేంద్ర న్యాయశాఖ భారీగా పెంచింది. 11 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈసవరణ జరిగింది. గ్రూప్-ఏ న్యాయవాదులకు ఫీజు ఒక కేసుకు 5. 13,500 ?? .21,600 ??. గ్రూప్-బీ, గ్రూప్ -సీ న్యాయవాదులకు ఫీజు 5.9,000 ?? .14,400 ??. ఫిబ్రవరి 1, 2026 నుంచి అమల్లోకి వచ్చిన ఈ నిర్ణయం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న వేలాది మంది ప్రభుత్వ ప్యానెల్ న్యాయవాదులకు లబ్ధి చేకూరనుంది.

## మాజీ మంత్రి అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరు



విజయవాడ, ఫిబ్రవరి 11,మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుకు గుంటూరు కోర్టులో ఊరట లభించింది. సీఐ విధులకు ఆటంకం కలిగించారన్న ఆరోపణలతో నమోదైన కేసులో ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. అదే సమయంలో, ఆయన్ను కస్టడీకి అప్పగించాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది.గత ఏడాది నవంబర్ 12న ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ గుంటూరులో నిర్వహించిన ర్యాలీ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. విధుల్లో ఉన్న సీఐని అడ్డుకున్నారని అంబటి రాంబాబుపై కేసు నమోదైంది. ఈ కేసులో ఆయనపై పీటీ వారెంట్ జారీ కావడంతో, పట్టాభిపురం పోలీసులు మూడు రోజుల క్రితం ఆయన్ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు.ఈ కేసుకు సంబంధించి విచారణ జరిపిన గుంటూరు కోర్టు, తాజాగా అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న ఆయన, కోర్టు ఉత్తర్వులతో విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

# రాజన్న ఆలయంలో భక్తుల సౌకర్యార్థం వాట్సాప్ సేవలు ప్రారంభం.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం భక్తులకు మరింత సులభంగా సేవలు అందించేందుకు వాట్సాప్ చాట్ బోట్ సేవలను ప్రారంభించింది.

సర్వీస్ ఇన్ జస్ట్ ఏ ఫ్యూ క్లిక్స్ అనే సందేశం తో భక్తులకు అవసరమైన సమాచారం మరియు సేవలను డిజిటల్ విధానంలో అందుబాటులోకి తీసుకువచ్చింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ సూచనల మేరకు బుధవారం రోజున వేములవాడలో రాజన్న ఆలయ ఈవో రమాదేవి అధికారికంగా ఈ సేవలను ప్రారంభించారు.

ఎలా ఉపయోగించాలి.

పోస్టర్లో ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి లేదా 8736936969, నెంబర్ కు వాట్సాప్ లో హాయ్ అని మెసేజ్ పంపండి.

అలా చేస్తే వెంటనే వాట్సప్ చాట్ బోట్ ద్వారా దేవస్థానం సేవల వివరాలు లభిస్తాయి.

స్కాన్ టు స్టార్ట్ యువర్ చాట్ నౌ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం.8736936969 వాట్సాప్ లో అందుబాటులో ఉన్న సేవలు

ఓం నమశ్శివాయ. శ్రీ రాజరాజేశ్వర స్వామి




దేవస్థానం వేములవాడకు స్వాగతం.

భక్తులు కింది సేవలను తమకు కావలసిన దాన్ని సంబంధిత సంఖ్యను నమోదు చేసి పొందవచ్చు, దర్శనం ఁ సేవల సమయాలు, దర్శన టికెట్ కౌంటర్లు, ప్రసాదం కౌంటర్, అన్న ప్రసాదం, రవాణా సదుపాయాలు, ఆసుపత్రి, దివ్యాంగులకు సౌకర్యాలు, త్రాగునీరు, మరుగుదొడ్లు, కళ్యాణకట్ట, సమాచార కేంద్రం, పోలీస్ స్టేషన్, ఉదాహరణకు :1 నుండి 12 వరకు సంబంధించిన సంఖ్యను నమోదు చేస్తే సంబంధిత సమాచారం పొందవచ్చు.

ఈ డిజిటల్ సేవల ద్వారా భక్తులకు వేగవంతమైన, పారదర్శకమైన మరియు సులభమైన సమాచారాన్ని అందించడం దేవస్థానం లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్చార్జి స్థానాచారి నమలికొండ ఉమేష్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్ శర్మ, ఈ ఈ రాజేష్, ఆలయ ఏఈఓ బ్రహ్మన్న గారి శ్రీనివాస్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఆలయ అర్చకులు మరియు వేద పండితులు పాల్గొన్నారు.

సాంకేతిక భాగస్వామిగా ఆత్రేయ ఇన్ఫోటెక్ సంస్థ సేవలను అందించింది.

# ప్రశాంతంగా ముగిసిన మునిసిపల్ ఎన్నికల పోరు

## తన ఓటు హక్కును వినియోగించుకున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ,



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 11 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** ఆందోల్ –జోగిపేట మున్సిపాలిటీ, ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లు తారు మారైన, మున్సిపాలిటీ కౌన్సిలర్ అభ్యర్థులుగా పోటీ చేసే, ఆశావహులు కొంత నిరుత్సాహానికి గురైన, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, దామోదర్ రాజనర్సింహ, రెండు మూడు రోజులు, ఆందోల్–జోగిపేట,మున్సిపాలిటీ మొత్తం పట్టణంలో, 20 వార్డులో, ఆందోల్ 5, వార్డులు,జోగిపేటలో 15 వార్డులు,ఉండగా మంత్రి అభ్యర్థుల వెంబడి ప్రతి వార్డు తిరుగుతూ, ప్రచారంలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ చేస్తున్నటువంటి అభివృద్ధి గురించి ఓట్లర్లకు ప్రజలకు ఇంకా అభివృద్ధి చేయబోయే పనుల గురించి వివరించారు, ఈ సందర్భంగా, ఆయన వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏర్పాటుచేసిన 9వ వార్డులోని పోలింగ్ స్టేషన్, 13,లో తన ఓటు హక్కును వినియోగించుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, అంతకుముందే కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వార్డు కౌన్సిలర్స్ అందరినీ, సమన్వయపరిచి ఒక్క తాటిపై పై నడిపించారు, మంత్రి దామోదర్ రాజనర్సింహ... 14వ వార్డు మాజీ కౌన్సిలర్ దుర్గేష్ ను, కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెన్షన్ చేస్తూ, డిసిసి మునిసిపల్ ఎన్నికల పరిశీలకులు, నిర్ణయం తీసుకున్నారు, కుల సమీకరణలో, కౌన్సిలర్ గా టికెట్ కోల్పోయిన దుర్గేష్, కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గం, మంత్రి దామోదర్ రాజనర్సింహ, నిర్ణయించిన, అభ్యర్థి జోగిళ్ళ చంద్రకళకు, వ్యతిరేకంగా రెబల్గా






పోటీలో ఉన్నందున గాను, ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు నాయకులు తెలిపారు...

# ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్





**కామారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:** కామారెడ్డి జిల్లా బుధవారం కామారెడ్డి మున్సిపాలిటీ లోని వార్డు నెంబర్ 18 లిమ్రా గార్డెన్ సమీపం లో గల ప్రైమరీ స్కూల్, , పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం జూం.అశీ.55 పోలింగ్ కేంద్రములో బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు చేరుకొని నిర్భయంగా ఓటు వేయాలని స్థానిక సుపరిపాలనలో భాగస్వాములు కావాలని అన్నారు. ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం ఉందన్నారు. అన్ని పోలీస్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ర్యాంప్స్ నిర్మించడమే కాక వీల్ చైర్స్ ను అందుబాటులో ఉంచామన్నారు. ఎన్నికల సంఘం గుర్తించిన 17 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి పోలింగ్ కేంద్రాలకు తీసుకువెళ్లి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

# దార్గులపల్లి గ్రామం లో డ్వాక్రామహిళా ల సంఘము బిల్డింగ్,ముగ్గ వేయడం జరిగింది



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 11 (ప్రజా బలం)** వికారాబాద్ జిల్లా దార్ల పల్లి గ్రామంలో డ్వాక్రా మహిళా సంఘాల భవనానికి ముగ్గు వేయడం జరిగిందని తెలిపారు ఏ ఈ పంచాయతీ సెక్రెటరీ గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాలరాజ్ మరియు గ్రామ పెద్ద లు నాయకులు యువకులు కార్యక్రమంలో పాల్గొని డ్వాక్రా మహిళా సంఘాల భవనం ముగ్గు వేయడం జరిగిందని తెలిపారు

# వికారాబాద్ లొ ప్రశాంతంగా ఓటింగ్, గడ్డం అనన్య గెలుపు పక్క, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సనా గారి కొండల్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఫిబ్రవరి11(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** వికారాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల భాగంగా ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్ వికారాబాద్ చైర్ మెన్ గా పక్క బాధ్యతలు స్వీకరించబోతున్న గడ్డం అనన్య అని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సనగారి కొండల్ రెడ్డి తెలిపారు వికారాబాద్ ప్రజల ఆశీర్వాదనీ కి అవధులే లేవు అంత బ్రహ్మాండంగా గడ్డం అనన్య ను ఆశీర్వదించారు కాబట్టి వికారాబాద్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధిస్తున్న మని తెలిపారు

# కేసీఆర్ జన్మదినం సందర్భంగా 17 న వ్యాస రచనపోటీలు

## గడ్డం శ్రీనివాస్ యాదవ్



హైద్రాబాద్ ఫిబ్రవరి 11 తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పోషించిన చారిత్రాత్మక పాత్రను విద్యార్థులకు తెలియజేసి వారి సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు, కేసీఆర్ జన్మదిన సందర్భంగా ఈ నెల 17వ తేదీన బీఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నిజాం కాలేజ్లో ప్రత్యేక వ్యాసరచన పోటీ నిర్వహించబడుతోంది. ఈ పోటీలో ూజ, ఇంటర్ మరియు డిగ్రీ విద్యార్థులు పాల్గొనవచ్చు. “తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ గారి పాత్ర” అనే అంశంపై నిర్వహించబడే ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి విజయాన్ని సాధించాలని శ్రీనివాస్ యాదవ్ కోరారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com